కర్నూలు | నంద్యాల
వార్త
3 నవంబర్ 2025 సోమవారం పేజీలు 4

# ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను.. స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**నంద్యాల, నవంబర్ 02 ప్రభాతవార్త ప్రతినిధి ;** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల



విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఎక్కువగా రెవెన్యూ సమస్యలు, ఫించన్లు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వంటి సమస్యలు ఆయన దృష్టికి రాగా ఆయా సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.

## ఈ రోడ్లు ఇంతే.. ఆదమరిచి ప్రయాణిస్తే ప్రాణాలు హరీ..!

- గుంతలమయంగా మారిన రోడ్లు
- ఏళ్లు గడుస్తున్నా రోడ్లు వేయని వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



**హాలహర్వి, నవంబర్02, ప్రభాతవార్త;** అసలే గుంతలమయమైన రహదారులు. ఆపై భారీ వర్షాల నేపథ్యంలో రహదారులు దారుణంగా మారాయి. అడుగుకో గుంత... వాటిపై వెళ్తే నడుములు విరుగుతాయి. రాళ్లు తేలిన రహదారులు. ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదానికి గురై ఆసుపత్రి పాలు కావాల్సిందే. ఈ రహదారుల్లో ప్రయాణంతో ఒళ్లు హూనమవుతుందని వాపోతున్న ప్రజలు. ఏళ్లు గడుస్తున్నా అధ్వానంగా మారిన రహదారులకు మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు ఇది హాలహర్వి మండలంలోని గ్రామీణ ప్రాంతాల రోడ్ల దుస్థితి. రోడ్లపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. **వివరాల్లోకి వెళితే...**

మండలంలోని చింతకుంట నుంచి కొక్కరచేడు, బేవినహాల్, సాకిబండ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు పూర్తి స్థాయిలో అధ్వానంగా మారాయి. ఆ రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తుంది. అడుగడుగునా మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. ఆదమరిచి ఈ రోడ్లపై ప్రయాణం చేస్తే ప్రాణాలు గాలిలో కలిసిపోవాల్సిందే. రోడ్లు ఛిద్రమై పదేళ్లు గడుస్తున్నా ప్రజాప్రతినిధులు గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. వర్షాకాలంలో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతాయి. రోడ్లు ఇలా అధ్వానంగా ఉండడంతో ఆ గ్రామాలకు అత్యవసర సమయంలో 108 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిట్రవట్టి గ్రామం నుంచి విరుపాపురంకు వెళ్లే రోడ్డు, గూళ్యం నుంచి సిద్ధాపురం, బల్లూరు గ్రామాలకు వెళ్లే రోడ్లు పరిస్థితి కూడా ఇలానే ఉంది. ఇప్పటికైనా సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



# తహశీల్దారా..మజాకా..!




- ప్రజలకు సేవలందించని తహశీల్దార్ వద్దంటూ ఫిర్యాదు..
- కార్యాలయంకు వచ్చిన వారిపై ఆగ్రహరిస్తూ..
- మధ్యాహ్నం వస్తూ.. పనులను విస్మరిస్తూ..
- ఇష్టం లేకుండానే విధులకు హాజరు..

**రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లకుండా తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడంటూ కోసిగి ప్రజలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది..తహశీల్దార్ రెవెన్యూ కార్యాలయానికి ప్రతి రోజుమధ్యాహ్నం 2 గంటల తరువాతనే వస్తుండడంతో కార్యాలయం ముందు వేచి ఉన్న ప్రజలు విసుగు చెంది తిరిగి వెళ్తున్నట్లుచెప్పతున్నారు..**

**కోసిగి, నవంబరు 2, ప్రభాతవార్త** కోసిగి తహశీల్దార్గా ఇష్టం లేకుండానే విదులకు హాజరవుతున న్నట్లు సంబందిత రెవెన్యూ సిబ్బంది చెప్పుతున్నారు..అసలు తనకు ఈ కోసిగి మండలం ఇష్టం లేదని, ఏదో కలెక్టర్ కార్యాలయంలో సెక్షన్ ఆధికారిగా ఉన న తనను ఈ సుదూర ప్రాంతంకు వేసారని బాధపడుతున న్నట్లు తెలుస్తోంది..ఇక మధ్యాహ్నం కార్యాలయానికి వస్తే లోపలికి పనుల నిమిత్తం వచ్చిన వారిపై ఆగ్రహంవ్యక్తం చేస్తున్నట్లు రేపు రండి లేదా సచివాలయంకు వెళ్లండి అంటూ తమను నిర్లక్ష్యానికి గురి చేస్తున న్నట్లు తెలిపారు.. కాగా ఏదైన పని నిమిత్తం రాజకీయ నాయకులు కార్యాలయంకు వస్తే వారికి సైతం సరైన సమాధానం ఇవ్వడం లేదని వారు కూడావాపోతున్నారు.. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇళ్లు మంజూరు చేసే నేపథ్యంలో వారికి అవసరమైన పొజిషన్సర్టిఫికెట్లను అందించకుండా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని వీలుంటే విచారణ చేసి పొజిషన్ సర్టిఫికెట్లను ఇస్తాననినిర్లక్ష్యంగా చెప్పు తుండడంతో ఇళ్లు కట్టించుకునేందుకు లబ్దిదారులు ముందుకు రాలేకపోతున న్నటు లు తెలుస్తోంది.. అంతేకాక గత ఐదునెలలుగా అర్హులైన రైతులకు సైతం పట్టాదారు పాస్ పుస్తకాలను కూడా మంజూరు చేయలేదని పలువురు రైతులు వాపోతునా న్నరు.. ఏమైనా అంటే విచారణ చేస్తామని కాలయాపన చేస్తున న్నట్లు తెలుస్తోంది..ఇక రెవెన్యూ సిబ్బంది ఏవైన రెవెన్యూ పనులు కోసం వస్తేమీరెందుకు వచ్చారు అవసరమైన వారే కార్యాలయానికి వస్తారంటూ సిబ్బంది చెప్పిన పనులు కూడా చేయక పోవడంతో వారుకూడా తహశీల్దార్ పట్ల వ్యతిరేకత ప్రదర్శిస్తున న్నట్లు తెలుస్తోంది..కోసిగి తహశీల్దార్గా గత ఐదు నెలల క్రితం వచ్చినా ఇంత వరకు కోసిగి మండలంలో రెవిన్యూకు సంబందించిన ఏ పని కూడా చేసినట్లు కనిపించడం లేదని పలువురు రెవెన్యూ సిబ్బంది గుసగుసలాడుతున్నారు..

**మోతుబారి రైతు సిపి.ఈరన్న పొలం సర్వేపై నిర్లక్ష్యం :**

కోసిగి గ్రామానికి చెందిన మోతుబారి రైతు సిపి.ఈరన్న పొలంను సర్వే చేయించడంలో తహశీల్దార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లురైతు సిపి.ఈరన్న తెలుపుతున్నారు..ఈ సంవత్సరం మార్చి నెలలో తమ పొలంకు సంబందించి సర్వే చేయాలని దరఖాస్తునుచేసుకోగా అప్పటి నుండి పని మాత్రం జరగలేదు..ఈ విషయంలో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తే వారి నుండి వచ్చిన ఆదేశాలుసైతం బేఖాతర్ చేస్తున్నట్లు, సర్వేయర్కు సరైన ఆదేశాలు ఇవ్వకుండా నిర్లక్ష్యానికి పాల్పడు తున్నట్లు రైతులు తెలిపారు.. ఇలాంటివిమండలంలో చాలా వరకు పెండింగ్లో ఉన న్నట్లు తెలుస్తోంది.. కావున ఈలాంటి తహశీల్దార్ తమకు వద్దంటూ జిలా ్ల అధికారులకుసోమవారం జరిగే గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు..

## పేదల పాలిట కల్పతరువు.. సీఎం రిలీఫ్ ఫండ్

**: మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి**

**నంద్యాల, నవంబర్ 02 ప్రభాతవార్త ప్రతినిధి:** పేద ప్రజల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వంలో కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి.కింద 50 మంది లబ్ధిదారులకు దాదాపు రూ. 42 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసిన మంత్రి.కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో ముఖ్య మంత్రి సహాయనిధి అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేదల పాలిట వరంగా మారిందని రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు. నేడు బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో 50 మంది లబ్ధిదారులకు రూ. 42,01,708/ విలువైన చెక్కులు మంత్రి చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తూ కొండంత భరోసానిస్తోందన్నారు. అనారోగ్యం కారణంగా నిరుపేదలు ఆర్థిక ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల వెన్నంటి ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నేడు రాష్ట్రంలో ఎన్నో ప్రాణాలు నిలబెట్టిన ఘనత గౌరవ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. అనంతరం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందుకున్న బాధితులు తమ సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, మంత్రికి, కూటమి ప్రభుత్వానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు..



# పింఛన్ పంపిణిలో.. సచివాలయ సిబ్బంది రూటే సపరేట్..!

- పింఛన్లు ఇచ్చేందుకు ఇళ్ళకు రారు..సచివాలయానికి రారు సిబ్బంది నిర్వాకం
- వారు ఇచ్చినప్పుడే పింఛన్లు తీసుకోవాలి.. నానా ఇబ్బందులు పడుతున్న.. పింఛన్దారులు
- ఆరు గంటలకు పింఛన్ ఇవ్వాలన్న ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్న.. సచివాలయ సిబ్బంది
- రెండవ రోజు కూడ పూర్తిగా అందని పింఛన్లు

**రాష్ట్ర ప్రభుత్వ ఎంతో ప్రతిష్టాత్మకంగా వికలాంగులకు, వృద్దులకు తెల్లవారక ముందే ఎన్టీఆర్ భరోసా పింఛన్ అంధించాలనే ఉద్దేశ్యంతో చేస్తున్న పింఛన్ల పంపిణిని ఆలూరులోని సచివాలయాల సిబ్బంది మా రూటే సపరేట్ అన్నట్టు వారు ఇళ్ళకు వెళ్ళరు సచివాలయానికి రారు. దీంతో పింఛన్దారులు అవస్థలు వర్ణణాతీం. గత ప్రభుత్వం తెల్లవారేలోపు వాలెంటరీ వ్యవస్థతో పింఛన్లు అందజేసేవారు, కూటమి ప్రభుత్వం వచ్చాక వాలెంటీర్ల వ్యవస్థ రద్దు కావడం సచివాలయ సిబ్బందిని ఇళ్ళకు వెళ్ళి పింఛన్లు పంపిణి చేయాలని ఆదేశాలు జారి చేసింది. దీంతో ఒక్క ఆలూరు మినహా రాష్ట్రం అంతట ఉదయం ఆరు గంటలలోగా పింఛన్లు అందుతున్నాయి. అయితే ఆలూరులో సచివాలయ సిబ్బంది స్తానికంగా ఉండడంలేదు.**



**ఆలూరు,నవంబరు 02,ప్రభాతవార్త:** ఇతర ప్రాంతాల నుండి ఉదయం 10 గంటలకు విధులకు వస్తారు. వారు ఇళ్ళకు వెళ్ళకుండా సచివాలయంలోనే లబ్దిదారులకు పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిసింది. 1వ తేదీ(శనివారం) పింఛన్ వస్తుందని పింఛన్ లబిద్దదారులు కొంత మంది ఇళ్ళ వద్ద, మరి కొంత సచివాలయాల వద్ద ఎదురు చూశారు. సచివాలయ సిబ్బంది 9 గంటలు అయిన రాక పోవడంతో ఇళ్ళ వద్ద ఉన్న వారు సచివాల యానికి పరుగులు తీశారు. అప్పటికే ఆరు గంటల నుండి పింఛన్ కొరకు సచివాలయం వద్ద ఎదురు చూస్తున్న వృద్దులు, వికలాంగులు ఉండడంతో వారికి నిరాశే మిగిలింది. వృద్దులు ఆకలిగొని అల్లాడిపోయారు. 1వ సచివాలయ సిబ్బంది 10 గంటలకు కార్యాలయానికి చేరుకోవడంతో వృద్దులు వికలాంగులు క్యూలో నిలబడడానికి ఒకరినొకరు తోసుకోవడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. సచివాలయం వద్ద ఒక వృద్దురాలు మతిస్థిమితంలేని తన మనువడును ఎత్తుకొని వచ్చి దాదాపు మూడు గంటల పాటు నిలబడి నీరసించిపోయింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పింఛన్ల పంపిణిపై ఎంతో గొప్పలుగా చెబుతుంటే ఆలూరు సచివాలయాలో మాత్రం అందుకు విరుద్దంగా 9 గంలు అయిన ఒక్కరికి పింఛన్లు అందడంలేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు, పింఛన్ పంపిణి చేసే సచివాలయ సిబ్బంది తాము అనుకున్న సమయానికే రావడం విశేషం. నియోజవర్గం కేంద్రంలోనే పరిస్థితి ఇలా ఉంటే గ్రామీణ ప్రాంతంలో ఇక ఎలా ఉంటుందోననే ప్రశ్నలు ఉత్పన్న మవుతున్నాయి. టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పింఛన్ల పంపిణిలో జరుగుతున్న నిర్లక్ష్యంపై జోక్యం చేసుకుంటేనైనా వృద్దులకు, వికలాంగులకు పింఛన్లు సకాలంలో అందే అవకాశం ఉందని లబ్దిదారులు అంటున్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం మూడు రోజులు ఇవ్వాలి. రెండవ రోజు కూడా సచివాలయ సిబ్బంది పూర్తిస్థాయిలో పంపిణి చేయ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కావున ఇప్పటికైన జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.





# చట్ట సభల్లో.. 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**: ఆర్. కృష్ణయ్య కర్నూలు బీసీ భవనానికి కోటి రూపాయల విరాళం ప్రకటింపు**

**కర్నూలు, హాస్పిటల్నవంబర్ 2: ప్రభాతవార్త :** కర్నూలు నగరంలోని లేపాక్షి హోటల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య బీసీలకు చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన కర్నూలు బీసీ భవన నిర్మాణానికి కోటి రూపాయల విరాళం ప్రకటించారు. సమావేశంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్, స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ విక్రమ్, స్టేట్ డైరెక్టర్ రామకృష్ణ, నక్కలమిట్ట శ్రీనివాసులు, రాంబాబు, కుమ్మరి రామకృష్ణ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ "బీసీల హక్కుల సాధన కోసం కేంద్రప్రభుత్వం ముందు 18 డిమాండ్లు సమర్పించాము. వాటిలో నాలుగు ఇప్పటికే పరిష్కరించబడ్డాయి. కేంద్రం జనగణనలో కులగణనను చేర్చడం చారిత్రాత్మక నిర్ణయం. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి ఫలితం. త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలిసి, ఆయన ద్వారా ప్రధాని మోడీ



బీసీల డిమాండ్లు అందజేస్తాం" అని అన్నారు. బీసీల ముఖ్య డిమాండ్లు: పార్లమెంటులో బీసీ బిల్లు ప్రవేశపెట్టి చట్ట సభల్లో 50 రిజర్వేషన్ కల్పించాలి. కేంద్రంలో బీసీల ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేయాలి. ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ మాదిరిగా బీసీల రక్షణకు "బీసీ యాక్ట్" తీసుకురావాలి. విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీ రిజర్వేషన్ను 27 నుండి 56 కు పెంచాలి. బీసీల తలసరి ఆదాయ పరిమితిని ..8 లక్షల నుండి ..15 లక్షలకు పెంచాలి. సమావేశం చివరగా బీసీల ఐక్యత, అభివృద్ధి కోసం ఉద్యమాన్ని మరింత బలపరచాలని నేతలు నిర్ణయించారు.

# 'డోన్'లో.. శ్రీ'మంతుడు.. పరార్..!




- 'డోన్'లో ఉడాయించిన రూ.20కోట్ల ఆస్థిపరుడు
- రూ.10కోట్ల అప్పుకు శఠగోపం పెట్టిన 'బడా రియల్టర్'
- వడ్డీలకు హారతికర్పూరమైన మరో రూ.10కోట్ల ఆస్థులు
- మొన్న కందులవ్యాపారి, నిన్న చిట్ఫండ్స్, నేడు రియల్టర్
- ఒకే నెలలో 'ముగ్గురు మోసగాళ్లు'... డోన్లో కలకలం...
- డోన్ పట్టణంలో కూలుతున్న 'రియల్ ఎస్టేట్ కోటలు'
- ఆర్థికఛిద్రంతో ధ్వంసమవుతున్న వ్యాపారుల ఆర్థికమూలాలు
- డోన్లో సంచలనం రేపుతున్న వ్యాపారస్థుల పరారీలు
- బయటకు చెప్పుకోలేక అంతర్మధనంతో కుంగుతున్న బాధితులు



పేరుకు చెప్పుకునేందుకే వారిది ఒక ఉన్నతమైన సామాజికవర్గం... అన్నింటిలోనూ మాదే పెత్తనం అని శ్రీరంగనీతులు వల్లించే మరక అంటని తెల్లచొక్కా వర్గం వారిది.. చూపుడు వేలుకు వజ్రపుటుంగరం మరో ఐదువేళ్ళకు బంగారు ఉంగరాలతో ఉదయం లేచింది మొదలు బుల్లెట్పై పట్టణంలో చక్కర్లు.. నివశించేందుకు సుమారు రూ.2కోట్ల అందమైన భవంతి.. ఇన్ని లక్షణాలు కలగలిపిన వ్యక్తి సొగసైటన జీవనాన్ని ఒక్కసారి కళ్ళముందు ఊహించుకుంటే 'శ్రీమంతుడు' అట్టే ఉట్టిపడక తప్పదు.. తనకు తల్లిదండ్రులను కాదని రూ.20కోట్ల ఆస్థిని స్వయంగా తానే సంపాదించినట్టుగా చెప్పుకునే ఆ శ్రీమంతుడే రాత్రికి రాత్రి ఉడాయించాడు... మొత్తం బాదితుల నెత్తిన శఠగోపం పెట్టి ఇంటినుంచి పరారయిపోయాడు.. అతనికి డబ్బులు ఇచ్చిన బాదితులు బయటకు చెప్పుకోలేక...బాదను దిగమింగలేక అంతర్మదనంతో కుమిలిపోతున్నారు.. ఇంతపెద్ద వ్యాపారి తమ కల్లెదుటే శ్రీమంతుడిలా కన్పించే పెద్ద సామాజిక వర్గంగా చెప్పుకునే బడా రియల్టర్ ఒక్కసారిగా పారిపోయాడన్న నిజాన్ని డోన్ పట్టణ ప్రజలు, ముఖ్యంగా వ్యాపారులు తట్టుకోలేకపోతున్నారు. డోన్ పట్టణంలో కలకలంరేపి పరారైన.. రూ.20కోట్ల ఆస్థిపరుడైన రియల్ ఎస్టేట్ వ్యాపారికి సంబంధించిన పూర్తివివరాలు 'ప్రభాతవార్త' అందిస్తున్న ప్రత్యేక కథనం ఇది.

డోన్, ప్రభాతవార్త :

## శ్రీకాకుళం లో మృతి చెందిన భక్తులకు కొవ్వొత్తులతో నివాళులు

**: ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి**

**చిప్పగిరి, నవంబర్, 02, ప్రభాతవార్త**

శ్రీకాకుళం లో కాల్వబుగ్గ సంగమేశ్వర దేవాలయంలో తొక్కిత లాటలో చనిపోయిన భక్తులకు ఆలూరు ఎమ్మెల్యే బుసిన విరుపాక్షి ఆదివారం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. చిప్పగిరిలో శ్రీ భోగ లింగేశ్వర స్వామి ఆలయం ముందు అయ్యప్ప భక్తులతో, గ్రామస్తులతో కలిసి, మృతి చెందిన భక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలకు దేవుడు మనోధైర్యాన్ని నింపాలని కొవ్వొత్తులతో ర్యాలీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడుతూ శ్రీకాకుళం బుగ్గ సంగేశ్వరం ఆలయంలో తొక్కిసటలాటలో 9 మంది భక్తులు మృతి చెందారన్నారు. వారిని ప్రభుత్వం వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మైనార్టీ నాయకులు సర్వర్ ఖాన్, మాజీ సర్పంచ్ సురేష్ రెడ్డి, తోపాటు గ్రామస్తులు, బి.వి.ఆర్ అభిమానులు, కేఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# 'డోన్'లో.. శ్రీ'మంతుడు.. పరార్..!

**ఊరువెలుపల ప్రత్యేక భవంతిలో...**

ఆయన నివాసం డోన్ పట్టణానికి శివారున ఓనైరో స్కూల్‌కు సమీపంలో దాదాపు రూ.2కోట్లు ఖర్చుతో నిర్మించిన కొత్త భవంతి అది. వారి సొంత గ్రామం పత్తికొండ నియోజకవర్గంలోని ఒక గ్రామం. అయితే బుడ్డలు, నూనె వ్యాపారం పేరుతో గత 30ఏళ్ళ క్రితం డోన్‌లో వ్యాపారాన్ని ప్రారంభించారు. బుడ్డల వ్యాపారంతో ఉన్న పరిచయాలు,వ్యాపారంలో వచ్చిన లాభాలతో అనతికాలంలోనే ఆర్థికంగా ఎదిగిపోవడంతో అందమైన భవంతిని, ఖరీదైన వాహనాలను కొనుగోలుచేసి బుడ్డల వ్యాపారానికి స్వస్థిచెప్పి రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టాడు. రియల్ రంగంలో మొదట బాగా లాభాలు ఆర్థించడంతో వ్యాపారాన్ని రెట్టింపు చేసేందుకు కొంత డబ్బును వడ్డీలకు కూడా తెచ్చుకుని పెట్టుబడిగా పెట్టి లాబాలను ఆర్థించాడు. పలు ప్లాట్లు, ఇల్లు, స్థలాలను కొనుగోలు చేసాడు. కొద్దిరోజుల్లోనే సుమారు రూ.20కోట్ల ఆస్థులకు ఆసామిగా మారాడు. ఆయన ఉన్న తీరును చూసి పెట్టుబడులు సైతం సామాన్యుడినుంచి ఇట్టే పుట్టసాగాయి.

**రియల్‌ఎస్టేట్ కుప్పకూలడంతోనే... అసలు సమస్య...**

కోవిడ్ తర్వాత తారాజువ్వలా ఎగసిపడ్డ రియల్ ఎస్టేట్ వ్యాపారంతో గత ఏడాదిన్నర క్రితంనుంచి ఉన్నఫలంగా కుప్పకూలిపోయింది. వడ్డీలకు తెచ్చి కొనుకున్న ప్లాట్లను, ఇళ్ళను, స్థలాలను కొనేందుకు ఎవ్వరూ ముందుకు రాకపోగా కనీసం స్థలాలను చూడటానికి కూడా సాహసం చేయడంలేదంటే రియల్‌ఎస్టేట్ రంగం ఏ విదంగా కుదేల్ అయిపోయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు...దీంతో శ్రీమంతుడిగా చెప్పుకునే ఈ రియల్ వ్యాపారిని సైతం ఆర్థిక భూతం వదలకుండా పట్టేసింది. దీంతో తన స్థలాలు, ఇళ్లు, ఫ్లాట్లను తనఖా పెట్టి చేసిన అప్పులను చెల్లించేందుకు అప్పుకు అప్పు చేసాడు. నెలనెల వాటికి వడ్డీలు, చక్రవడ్డీలు పెరిగిపోతున్నాయే తప్ప రియల్‌ఎస్టేట్ వ్యాపారం మాత్రం తిరిగి పుంజుకోలేదు. దీంతో ఆ వ్యాపారి మరో అవతారం ఎత్తాడు. ఇంతవరకు తన ఆస్థులను మాత్రమే తనఖాపెట్టి అప్పులుచేసి ఇప్పుడు బయటివ్యక్తులకు అధికవడ్డీలను సైతం ఎరగా వేసాడు.

**రూపమే కొంపముంచింది....**

ఆర్థిక ఇబ్బందులతో సతమమతవుతున్న వ్యాపారి అధికవడ్డీల ఎరవేసాడు. తెల్లచొక్కాతో చేతికి ఉంగరాలతో ఖరీదైన భవంతి, వాహనంపై తిరుగాడే వ్యక్తి డబ్బులను వడ్డీకి అడిగాడంటే ఏమీ ఆలోచించకుండానే లక్షలకు లక్షలు కుమ్మరించేసారు. శ్రీమంతుడిలావున్న ఆ వ్యక్తికి డబ్బిస్తే వడ్డీ వస్తుందన్న ఆశతో దాదాపు రూ.10కోట్లకు పైగానే 3నుంచి 5రూపాయల వడ్డీకి అప్పులు ఆ వ్యాపారికి గుమ్మరించేసారు. వ్యాపారి ఆస్థులను తకట్టుపెట్టు కున్న వారంతా బడా వ్యాపారులు, వివిద రాజకీయ పార్టీల నాయకులు కాగా ప్రాంసరీ నోట్లపై అధిక వడ్డీలకు ఆశపడి ఇచ్చినవారంతా మాత్రం పాపం చిరువ్యాపారులే కావడం విస్మయాన్ని కల్గిస్తోంది. పాపం ఆయన రూపాన్ని చూసిన ఈ సామాన్యులు రూ.5వడ్డీ వస్తుందని ఆశపడ్డారే తప్ప తమ విశ్వాసాన్ని నిట్టనిలువునా రాత్రికిరాత్రి మోసం చేసి ఉడాయిస్తాడని ఊహించుకోలేకపోయారు.

**వడ్డీకి ఆశపడి... పాపం ఇంటిని అమ్మి...**

ఆ రియల్ వ్యాపారి ఇంటికి సమీపంలోని ఓ చిరువ్యాపారివద్ద ప్రతిరోజు కిరాణం, పాలు, పెరుగులాంటి సరుకులను తీసుకెల్లూ పెంచుకున్న పరిచయంతో వారికి కూడా ఈ వ్యాపారి డబ్బులను ఎరగా వేసాడు. దీంతో వడ్డీ వస్తుందని ఆశపడ్డ ఆ చిరువ్యాపారి తనవద్ద అప్పుగా ఇచ్చేందుకు డబ్బులు లేకపోయినప్పటికి తన ఇంటిని తాకట్టుపెట్టి దాదాపు రూ.22లక్షలను తీసుకవచ్చి ఈయన చేతిలో పెట్టి ఇప్పుడు నిట్టనిలువునా మోసపోయి లబోదిబోమంటున్నారు. పాతబస్టాండ్ సమీపంలోని మరో వ్యాపారి ఏకంగా రూ.5వడ్డీ వస్తుందన్న ఆశతో ఇంటినే విక్రయం చేసి ఈ వ్యాపారికి రూ.50లక్షలు అప్పుగా సమర్పించారు. కొత్తబస్టాండ్ సమీనంలో మరో కిరాణం షాపు యజమాని వడ్డీకి ఆశపడి రూ.15లక్షలు ఇచ్చినట్లు సమాచారం. అదేవిదంగా జగదుర్తి గ్రామానికి చెందిన వ్యాపారి రూ.15లక్షలు, వారికి బందువైన వైకాపాకు చెందిన వ్యక్తి మరో రూ.10లక్షలు, సాయిబాబా దేవాలయం సమీపంలోని మరో వడ్డీ వ్యాపారితో పాటు, గెస్ట్ హౌస్ సమీపంలో వుండే టిడిపికి చెందిన ప్యాపిలి మండల గ్రామ నాయకుడు, అదే టిడిపికి చెందిన కన్నపుకుంట, కమలాపురం, దర్మారం గ్రామాలకు చెందిన నాయకులు సైతం లక్షలకు లక్షలు ఈ వ్యాపారికి అప్పులరూపంలో సమర్పయామి అన్పించేసారు. పరారైన వ్యాపారి ఇంటి సమీపంలోని ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడితోపాటు మరికొంతమంది టీచర్లు, రియల్ వ్యాపారులు, ఫైనాన్స్ నిర్వాహకులు బాదితులగా మిగిలిపోయారు. సుమారు రూ10కోట్లకు పైగానే ఇప్పటికి అప్పులు తేలినట్టు ప్రాథమిక సమాచారం. ఇంకను ఆయా గ్రామాల్లో సైతం రైతులనుంచికూడా పెద్దమొత్తంలోనే అప్పులు చేసినట్లు తెలుస్తోంది.

**వడ్డీలకు హారతికర్పూరమైన రూ.10కోట్ల ఆస్థి:**

అప్పులుచేసి రూ.10కోట్లతో పరారీకాగా కొంతమందికి తన ఆస్థులను తాకట్టుపెట్టి మరీ అప్పులు చేసాడు. వారికి మాత్రం ఫుల్ రిజిస్ట్రేషన్‌లువుండంతో ఆ ఆస్థులు వారీ వడ్డీలకే హారతి కర్పూరం అయిపోయాయి. ఈ వ్యాపారికి చెందిన గాంధీ సర్కిల్‌లోని ఒక వ్యాపార సముదాయం ప్యాపిలి మండలానికి చెందిన టిడిపి మండల నాయకుడికి రూ.కోటి న్నరకు స్వంతమైంది. అదేవిదంగా డోన్ కోర్టులోని ఒక న్యాయవాదికి ఇల్లు, స్థలాన్ని దాదాపు రూ.కోటి 70లక్షలకు ఫుల్ రిజిస్ట్రేషన్‌తో తాకట్టుపెట్టేసాడు. అదేవిదంగా దర్మారం గ్రామానికి చెందిన మరో పారిశ్రామికవేత్తకు 50లక్షల విలువచేసే స్థలం తాకట్టుపెట్టగా తాను నివాసముండే ఇంటిని సైతం కేవలం పరారీకావడానికి మూడు రోజుల ముందు ఒక మహిళా ఉపాధ్యాయురాలికి రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం. బ్యాంక్‌లో తాకట్టువున్న ఆ ఇంటిని ఆ ఉపాధ్యాయురాలు తన లోన్‌ద్వారా చెల్లించి వారిపేరుతో చేయించుకున్నట్లు ఈ ఇల్లు క్రయవిక్రయాల్లో మీడియేటర్‌గా వ్యవహరించిన ఏజెంట్లకు ఇవ్వాల్సిన కమీషన్‌నుకూడా ఇవ్వకుండా తెల్లారితే ఇస్తానని చెప్పి ఉడాయించినట్లు బాదితులు నెత్తినోరు బాదుకుంటున్నారు.

**ఒకే నెలలో 'ముగ్గురు మోసగాళ్లు'... డోన్‌లో కలకలం...**

మొన్నటికి మొన్న కొండపేటలో కందులవ్యాపారి రూ.12కోట్లకు ఐపి పెట్టగా, క్రిష్ణానగర్‌లో నివాసముండే చీటీల నిర్వాహకుడు రూ.2కోట్లతో ఉడియించిన సంగతిని మరువకముందే నేడు ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఏకంగా సుమారు రూ.10కోట్లతో ఉడాయించిన ఘటన డోన్ పట్టణంలో కలకలం రేపుతోంది. పట్టణంతోపాటు పల్లెల్లోని రైతులతో సైతం ఈయన పెద్దమొత్తంలోనే అప్పులు చేసినట్లు ఇప్పుడిప్పుడే తెలియవస్తుందటంతో ఈ కోట్లు మరింత పెరిగే అవకాశంవుంది. ఒకే నెలలో ముగ్గురు మోసగాళ్ళతో డోన్‌లో ఆర్థికవ్యవస్థ పూర్తి చిద్రమైపోయింది. వడ్డీలు కట్టలేక రియల్ వ్యాపారం కుప్పకూలడంతో రియల్‌ఎస్టేట్ చేసే చిన్నవ్యాపారుల కోటలు కుప్పకూలిపోతున్నాయి. ఆర్థికవ్యవస్థనే పూర్తిగా డోన్ పట్టణంలో ద్వంసమైందంటూ వ్యాపారస్తులు చర్చించుకోవడం కొసమెరుపు.

**బిట్‌కాయిన్ దెబ్బకు..బయటకు చెప్పుకోలేక...**

వ్యాపారి చేతిలో మొసపోయిన బాదితులు బయటకు చెప్పుకునేదుకు కూడా సాహసించడంలేదు. కారణం గత ఆరుమాసాల క్రితం దాదాపు కోటానుకోట్లు పెట్టుబల్లుగా బిటికాయిన్స్‌లో పెట్టుబడిగా పెట్టి శ్రీరామ థియేటర్ వద్దవుండే నిర్వాహకుడు చేతులెత్తేయడం బాదితులు పోలీస్‌స్టేషన్ ఆశ్రయించడం తెలిసిందే. బాదితులకు న్యాయం జరగలేదన్న ఉద్దేశ్యంతో ఇప్పుడుకూడా ఇంతడబ్బును వడ్డీగా వ్యాపారికి ఇచ్చామంటే ఎక్కడ తమకు మోదటికే మోసం వస్తుందేమో అన్న ఉద్దేశ్యంతో బాదితులు స్టేషన్ మెట్టు ఎక్కడానికి సాహసం చేయడంలేదు. అయితే ఆర్థిక మోసాల్లో ఈ విదంగా మోసపోయినప్పుడు పోలీసులుకూడా ఏమీ చేయలేరన్న విషయం సామాన్యులకు తెలియదు. తమ డబ్బులతో పారిపోయినాడు తెప్పించి, ఇప్పించి న్యాయం చేయండని ఆవేదం చెందడంతప్ప అసలు అది పోలీసుల పరిదిలో వుంటుందాఅన్నది వారికి అర్థం కాదు. దీంతో చెప్పుకున్నా ఒరిగేదేమీ లేదని అందర్మథనంతో తేలుకుట్టిన దొంగల్లా ఉండిపోతున్నారు. బాదితుల్లో ముగ్గురుమాత్రం కోర్టుద్వారా వ్యాపారినుంచి రాబట్టేందుకు మల్లగుల్లాలు పడుతుండగా తననేమీ చేయారన్న ధీమాతోనే ఆ వ్యాపారి పరారైనట్లుకూడా పట్టణంలో గుసగులసలు విన్పిస్తున్నాయి. ఏది ఏమైనా పట్టణంలో ఇంతపెద్దమొత్తంలో వ్యాపారి పరారీ కావడంతో ఇంకెతమంది ఈ అప్పుల ఊబిలో కూరుకుపోతారోనన్న మీమాంస చక్కర్లు కొడుతోందనడంలో సందేహంలేదు.

## విద్యార్థులను వేధిస్తున్న నర్సింగ్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి..

**కర్నూలు, నవంబర్ 02, ప్రభాతవార్త ప్రతినిధి :**




అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలోన నాయకుల సమావేశం నిర్వహించడం జరిగినది ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు డి.సోమన్న మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా వందల మంది విద్యార్థులు బీఎస్సీ,నర్సింగ్ గాని తదితర కోర్సులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినటువంటి సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవడం జరిగిందని దరఖాస్తు చేసుకున్న తర్వాత చాలామంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ ల మీద ఫ్రీ సీట్లు అలాట్మెంట్ కావడం జరిగిందని కానీ జిల్లాలో ఉన్నటువంటి కొన్ని నర్సింగ్ కళాశాలలో ధనార్జన ధ్యేయంగా సరైనటువంటి వసతులు లేకపోయినా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మేము ఫీజు రిబర్స్మెంట్ ల మీద స్కాలర్షిప్ల మీద సీట్లు మంజూరు చేస్తామని చెప్పేసి పర్మిషన్లు వచ్చిన తర్వాత విద్యార్థులకు సీట్ల అలాట్మెంట్ అయినా కళాశాల దగ్గరికి వెళ్లి మాకు అలాట్మెంట్ కార్డు ఇవ్వాలని కోరితే విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తూ ఉన్నారని కచ్చితంగా విద్యార్థులు ముందుగానే అలాట్మెంట్ కార్డు తీసుకోవాలి అంటే కళాశాలలో 40,000 నుంచి 50 వేల రూపాయలు ముందుగానే కళాశాలలకు కట్టాలి అని లేకపోతే లేకపోతే అలాట్మెంట్ కార్డు ఇవ్వమని చెప్తా ఉన్నారని ఇది చాలా సిగ్గుచేటు అయినటువంటి విషయమని ఒకవేళ ఎవరో ఒకరు విద్యార్థులు ప్రశ్నిస్తే వారి తోటి ఒక నెలలోపు మాకు ఫీజులు కట్టాలి అనే విధంగా అగ్రిమెంటు రాసించి ఇవ్వాలని విద్యార్థులని ఒత్తిడి చేస్తూ అలా చేయని యెడల వారి సీట్లను క్యాన్సల్ చేస్తా ఉన్నారని క్యాన్సిల్ చేసినటువంటి సీట్లను లక్షలకు లక్షలు వేరే వారికి అమ్ముకుంటా ఉన్నారని అటువంటి కళాశాలల మీద తక్షణ చర్యలు తీసుకొని ఆ కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని అదే విధంగా ల్యాబ్ ల ఫీజులు, బస్సుల ఫీజులు, అనేకమైనటువంటి ఫీజులని వసూలు చేస్తూ వసతులు కూడా సరిగా లేకపోయినటువంటి కళాశాలలు జిల్లాలో ఉన్నాయని ఆ కళాశాలల్ని వెంటనే సీజ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రప్రభుత్వం ఇప్పటిదాకా పెండింగ్లో పెట్టినటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్లను కూడా విడుదల చేయాలని పేపర్ ప్రకటనలకే పరిమితం కాకుండా విద్యార్థులకు మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగాలని ఆయన డిమాండ్ చేశారు .లేనియెడల విద్యార్థులను కలుపుకొని ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్షులు ఎస్.అభి నగర సహాయ కార్యదర్శి మధు, వీరేష్( వీర), నగర నాయకులు మునిస్వామి, వరుణ్,రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన వ్యవసాయ కార్యాలయం

**రుద్రవరం, నవంబరు 2, ప్రభాతవార్తః**



మండల కేంద్రం రుద్రవరంలోని వ్యవసాయ కార్యాలయం పూర్తిగా శిధిలావస్థకు చేరింది. దాదాపు 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈకార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఈకార్యాలయంలో విధులు నిర్వహించడానికి సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. కార్యాలయ భవనంపై భాగంలో పూర్తిగా దెబ్బతిన భారీవర్షాలు కురిసిన సమయంలో పెచ్చులూడి నీరుకారుతుండడంతో కార్యాలయంలోని ఫైళ్లు, కప్యూటర్లు దెబ్బతినే అవకాశం ఉండడంతో అధికారులు వాటిపై కవర్లు వుంచి విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. కార్యాలయ భవనం ఎప్పుడు కూలుతుందోనని భయంతో సిబ్బంది విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే వ్యవసాయ కార్యాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని అయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

## ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**నందికొట్కూరు, నవంబర్ 2, ప్రభాతవార్త :**



ఏపి రెవిన్యూ అసోసియేషన్‌లో భాగంగా ఆత్మకూరు రెవిన్యూ డివిజన్ నూతనన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. రెవిన్యూ ఉద్యోగస్తులు తమ సమస్యల కోసం నిరంతరం పోరాడడానికి ఎన్నికలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ ఎన్నికకు నందికొట్కూరు తహసిల్దార్ బి.శ్రీనువాసులు, జూపాడుబంగ్లా తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, పాములపాడు తహసిల్దార్ సుభద్రమ్మ ఎన్నికల అధికారిగా నిర్వహించారు. అధ్యక్షుడుగా పెద్దన్న, ఉపాధ్యాక్షుడుగా కె.అరుణ, కార్యదర్శిగా సత్యనారాయణ, కోశాధికారిగా ఆంజనేయులు కమిటీ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. అధ్యక్షుడు పెద్దన్న మాట్లాడుతు డివిజన్‌లో ఏ ఉద్యోగస్తునికి అయిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకుని వస్తే వాటి పరిష్కారానికి కృషిచేస్తామని, ఉద్యోగస్తులు చేస్తున్న పనిభారం మరియు వారికి వచ్చే సమస్యలను ఎదుర్కోవడానికి డివిజన్ రెవిన్యూ అధికారులు అండగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ప్రసాద్‌బాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పనకు తక్షణమే చర్యలు తీసుకోండి

– అధికారులకు మంత్రి బీసీ అదేశం

**బనగానపల్లె, నవంబరు 2, ప్రభాతవార్తః**



మౌళిక సదుపాయల నిమిత్తం ప్రజల నుండి వచ్చే వినతులకు తక్షణమే పరిష్కారం చూపాలని రోడ్ల, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్థన్‌రెడ్డి అధికారులకు అదేశించారు. ఆదివారం బనగానపల్లె పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ప్రజావినతుల సమస్య కార్యక్రమం నిర్వహించారు. ఈసందర ్భంగా ప్రజలనుంచి వచ్చిన వినతులను స్వీకరించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరిస్తామని బాధితులకు హామి ఇచ్చారు. పరిష్కారమయ్యేసమస్యల విషయంలో మంత్రి సబంధిత అధికారులతో అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడి అయా సమస్యలను పరిస్కరించారు. అదేసమయంలో క్షేత్రస్థాయిలో మౌలిక సదుపాయాలకల్పనపై వచ్చు సమస్యలను పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను అదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు.

## తెర్నేకల్ డాక్టర్ పాటిల్ సూర్యనారాయణరెడ్డి సేవలు మరువలేనివి..

– వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి



**దేవనకొండ, నవంబర్02, ప్రభాతవార్త;**

తెర్నేకల్ డాక్టర్ పాటిల్ సూర్యనారాయణరెడ్డి సేవలు మరువలేనివని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పాటిల్ సూర్యనారాయణరెడ్డి సంస్మరణ దినం సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాటిల్ సోమిరెడ్డి, పాటిల్ శేషమ్మ దంపతుల పెద్దకుమారుడు పాటిల్ సూర్యనారాయణరెడ్డి వైద్యరంగంలో ప్రొఫెసర్‌గా ముంబాయి ఆసుపత్రిలో 30 సంవత్సరాలు పనిచేసి, ఉత్తమ వైద్యుడిగా మన్ననలు పొందాడన్నారు. ఆయన పదవీ విరమణ అనంతరం సొంత గ్రామమైన తెర్నేకల్‌కు చేరుకుని వైద్యసేవలు అందించి దాతగా ఆయన దేవాలయ గోపుర నిర్మాణం కట్టించి ప్రజల మనసులో మంచి సేవకుడిగా గుర్తిండిపోయాడని ఆయన సేవలను తెర్నేకల్ సురేందర్‌రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు శేషాద్రిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ అరుణ్‌కుమార్, బెల్ ఈరన్న, ఎంపీటీసీ నామాల శ్రీను, మాజీ ఎంపీటీసీ కురువ ఈరన్న, వాల్మీకి రాఘవేంద్ర, గ్రామంలోని పెద్దలు పాల్గొన్నారు.

## వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు..!

– మాల సంఘాల జేఏసీ రాష్ట్రకార్యదర్శి దస్తగిరి

**బనగానపల్లె, నవంబరు 2, ప్రభాతవార్తః**

వర్గీకరణ అంతం మాలల పంతం అంటూ మాలల సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యదర్శి దస్తగిరి, నంద్యాల మాలమహానాడు జిల్లా అధ్యక్షులు బండి దేవాంతకుడు అన్నారు. బనగానపల్లె పట్టణంలో అవుకుమెట్ట డా.బిఆర్ అంబేద్కర్ దగ్గర ప్లకార్డులు పట్టుకుని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. వర్గీకరణ వద్దు ఐక్యత ముద్దు అంటూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ క్లిమిలేయర్ విధానాన్ని రద్దుచేయాలని ఎస్సీ కార్పొరేషన్ నిధులు మంజూరు చేయాలనిపెరిగిన జనభా ప్రకారం రిజర్వేషన్ శాతాన్ని 20శాతానికి పెంచాలని దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ బనగానపల్లె నియోజకవర్గ అధ్యక్షులు గోపాజి సత్యమన్న మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మంజూరుయిన మెడికల్ కళాశాలలు నంద్యాల, మార్కాపురం, ఆదోని, పులివెందుల, పాలకొల్లు, పెనుగొండలో ఏర్పాటు చేశామని అయితే కూటమి ప్రభుత్వం ప్రైవేట్ పరం చేయడానికి తీసుకువచ్చిన జివోనం.59ని వెంటనే రద్దుచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్రకార్యదర్శి మారం నాగరాజు, రాయలసీమ అధ్యక్షులు మద్దిలేటి, జిల్లాకార్యదర్శి కె శివుడు తదితర మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.



## పోలీసుశాఖలో ఆత్మకూరు సిఐ రాముకు అపూర్వ గౌరవం

: మొంథా తుపాన్‌లో అండగా నిలిచిన పోలీసుల సేవలు : ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంస పత్రం, ప్రతిభ అవార్డు : టిడిపి మండల సీనియర్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి

**ఆత్మకూరు, నవంబర్ 2, ప్రభాతవార్త :**



మొంథా తుపాన్‌లో ఆత్మకూరు ప్రాంత ప్రజలకు అండగా నిలిచి వరదలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ప్రజలకు కావాల్సిన మౌళిక సదుపాయాలు కల్పించడంలో ప్రత్యేక చొరవ తీసుకున ఆత్మకూరు సిఐ రాముకు రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుశాఖలో అపూర్వ గౌరవం దక్కిందని టిడిపి మండల సీనియర్ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దులాపురం బాష, మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, మైనార్టీ టిడిపి సీనియర్ నాయకులు నాగూర్‌ఖాన్, వెంకటాపురం టిడిపి సీనియర్ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సిద్దాపురం టిడిపి మహిళ నాయకురాలు ఎస్తేరమ్మ, కృష్ణాపురం శివారెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో అర్బన్ సిఐ రామును పూలమాలతో ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ మొంథా తుపాన్‌లో వరదలో ప్రజలకు ఆత్మకూరు అర్బన్ సిఐ రాము ఎన్నలేని సేవలు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవార్డు, ప్రశంస పత్రం అందుకోవడం మంచి శుభపరిణమని కొనియడారు. ప్రజల మనల్నలు పొందుతూ రాష్ట్ర వ్యాప్తంగా సిఐ రాముకు ప్రత్యేక గౌరవం దక్కడం ఆత్మకూరు ప్రాంత ప్రజలకు గౌరవమని కొనియడారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు పోలీసుశాఖలో ప్రత్యేక విధులు నిర్వహించి తనదైన శైలిలో రాము ప్రజలకు సేవలు అందించారని వివరించారు. ఈ కార్యక్రమంలో ముష్టపల్లి టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తుంగభద్ర నదిలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి

**మంత్రాలయం, నవంబర్02, ప్రభాతవార్త;**



మంత్రాలయం మండలం తుంగభద్ర గ్రామానికి చెందిన వీరేంద్రగౌడ్(26) స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయి, ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఈశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి వివాహం కాలేదు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తల్లిదండ్రులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. మృతిచెందిన వీరేంద్రగౌడ్ చివరి సంతానం.

## కుర్ణి (నేసే) దైవచారా సంఘం కార్తీకమాస వనభోజన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీసీ రాజారెడ్డి

**బనగానపల్లె, నవంబరు 2, ప్రభాతవార్తః**



ఐక్యమత్యంగా మెలగి అభివృద్దికి ఒకరికొకరు తోడ్పాటు అందించాలని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి సూచించారు. బనగానపల్లె పట్టణంలోని మంగళవారంపేటకు చెందిన కుర్ణి (నేసే)దైవాచార సంఘం అహ్వానం మేరకు ఆదివారం ఏర్పాటుచేసిన కార్తీక వనభోజన కార్యక్రమానికి బీసీ రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వనభోజన కార య్రక్రమంలో పాల్గొని స్వయంగా భోజనం వడ్డించారు. కార్తీక వనభోజనంలో పాల్గొనడం వల్ల స్నేహభావంతోపాటు అధ్యాత్మికతపై అవగాహన కలుగుతుందని హిందువులకు పవిత్రమైన మాసం కార్తీకమాసం అని కార్తీకమాసంలో పూజా కార్యక్రమాలు, వనభోజనాలు నిర్వహించడం అభినందనీయమని బీసీ రాజారెడ్డి పేర్కొన్నారు. నీలకంటేశ్వరస్వామి దేవాలయ సిబ్బంది, కుర్ణి దైవచారా సంఘం కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్బన్ సిఐ రామును సన్మానించిన టిడిపి యువ నాయకుడు

: సొంపల్లె వెంకట్రావు : మొంథా తుపాన్‌లో ఆత్మకూరు ప్రాంత ప్రజలకు సిఐ ఎన్నలేని సేవలు : ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవార్డు తీసుకోవడం హర్శం

**ఆత్మకూరు, నవంబర్ 2, ప్రభాతవార్త :**



మొంథా తుపాన్‌లో ఆత్మకూరు ప్రాంత ప్రజలకు అర్బన్ సిఐ డి.రాము ఎన్నలేని సేవలు అందించి రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆవార్డు ప్రశంస పత్రం తీసుకోవడం హరి ్షంచదగ విషయమని టిడిపి యువ నాయకుడు సొంపల్లె వెంకట్రావు, సిద్దపల్లె టిడిపి సీనియర్ నాయకులు మాజీ గ్రామ సర్పంచ్ గంగాధర్ రెడ్డిలు అన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక పోలీసు స్టేషన్‌లో అర్బన్ సిఐ రామును పూలమాల, దుశాలవలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొంపల్లె వెంకట్రావు మాట్లాడుతూ వరద తుపాన్‌లో గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసుశాఖ ఎంతో కీలకంగా పనిచేయడం జరిగిందన్నారు. పోలీసులు సమాజంలో లేకపోతే ప్రజలకు రక్షణ లేకుండా పోయోదని అన్నారు. పోలీసులు అందిస్తున్న సేవలతో ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారని వివరించారు. ముఖ్యంగా ఆత్మకూరు ప్రాంతంలో అర్బన్ సిఐ రాము సేవలను గుర్తించి రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆవార్డు తీసుకోవడం ఆత్మకూరు ప్రాంతానికి అరుదైన గౌరవం దక్కిందని కొనియడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## బనగానపల్లెలో శాలీవాహన కార్తీక వనభోజనాలు

**బనగానపల్లె, నవంబరు 2, ప్రభాతవార్తః**



బనగానపల్లె పట్టణంలోని అవుకురోడ్డులో గల సాయిబాబా దేవాలయంలో నియోజకవర్గ శాలివాహన కార్తీక వనభోజనాలు సంఘం అధ్యక్షులు కే సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీ శాలీవాహన కార్పొరేషన్ మాజీ చైర్మన్ పురుశోత్తమ్, మాజీ జడ్పీటిసి వరలక్ష్మీ ్మ, జిల్లా అధ్యక్షులు సోమేష్‌లు పాల్గొన్నారు. అనంతరం మహిళలతో తులసికోటకు పూజాదీపోత ్సవ కార్యక్రమం నిర్వహించారు. అదేసమయంలో మొన్నటి డిఎస్సీలో ఉద్యోగం దక్కించుకున్నవారికి సన్మానం, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరిగిందని కుమ్మరి సురేష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిసంవత ్సరం శాలీవాహన కుటుంబాలు కలిసిమెలసి వనభోజన కార్యక్రమం జరుపుకోవడం మాకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో నాగరాజు, శివరామ మద్దిలేటి, నాగభూషణం, జ్యోతిశ్వరుడు, రామసుబ్బయ్య, వెంకటాపురం హరి, నాగశేషు, నాగేంద్ర, వీరేంద్ర, పాతపాడు కుమ ్మరి శివయ్య, బిజ్జన్న, రామాపురం హరి, పెట్టికోట శివయ్య, అధిక సంఖ్యలో శాలీవాహన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సమాధుల తోటలో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్ధనలు

**పెద్దకడబూరు, నవంబర్ 2, ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన పెద్దకడబూరులో స్థానిక ఆర్.సి.యం చర్చి ఫాదర్ రెవరెండ్ రాజేంద్ర ఆధ్వర్యంలో క్రైస్తవ సోదరులు ఆదివారం సాయంత్రం సమాధుల తోటలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ సకల ఆత్మల పండుగ సందర్బంగా మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని నిత్య విశ్రాంతి కలగాలని ప్రార్థించడం జరిగింది అన్నారు ప్రతి క్రైస్తవుడు తమ పెద్దల ఆత్మకు శాంతి కలిగేలా క్యాండిల్ వెలిగించి ప్రార్ధనలు చేయాలన్నారు ప్రతి ఒక్కరికి మరణం తప్పదని ఉన్నన్ని రోజులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి అందరి మధ్య సంతోషంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో చర్చి సంఘ పెద్దలు క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇచ్చిన అన్నిహామీలను తీరుస్తాం..!

### : కుందూ నది వంతెనపై 19లక్షలతో మరమ్మత్తులు



**నంద్యాల, నవంబరు 2, ప్రభాతవార్తప్రతినిది :** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానము అన్నింటిని ప్రియార్టీ ప్రకారము తీరుస్తామని మొంథా తుపాన్‌కు దెబ్బతిన్న కుందూ వంతెన మరమ్మత్తు పనుల రూ 19లక్షలతో యుద్ధప్రాతిపదికన చేస్తున్నామని రాష్ట్ర తెలుగు దేశం పార్టీ కార్యదర్శి మంత్రితి కుమారు యన్‌యండి ఫిరోజ్ అన్నారు. ఇటీవల మొంతా తుపాన్ తాకిడికి నందమూరినగరు,. వైయస నగరుల మద్య ఉన్న కుందూ వంతెన దెబ్బ తినడము దానిని యుద్ద ప్రాతిపదికను మరమ్మత్తులు చేపట్టుతున్నారు. వాటిని అదివారము ఫిరోజ్ పరిశీలించారు. ఈ సందర్బముగా అయన మాట్లాడుతూ అబివృద్ధి చేయాలనే తలంపు ఉండాఇలే కాని కాస్త అలస్యమైన అబివృది అడుగులు ముందుకు పడతాయని చెప్పారు.ఏల్లు గడుస్తున్న అబివృద్ధికి నోచుకోని రోడ్ల నిర్మాణనికి మోక్షం కలిగిందని నందమూరినగరు వైయస్ నగరుకు వెల్లె ప్రదాన రహాదారి కుందూ వంతెన నుంచే వెళ్ళాల్సిఁంది .రాణి, మహారాణి నుంచి గుంతల మయం కావడముతో నేతలు పట్టించుకును నాదుడు కరువయ్యాడు. గత 20సంవత్సరాలు అ రహదారిలో వెళ్లాంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. నూతన వంతెన ఏర్పాటు హడావుడి మొదలైనా పనులు అసంపూర్తిగా ఉండడము ఏ ప్రభుత్వాలు వచ్చిన కుందూ వంతెనకి మోక్షం లబించలేదు ఈ నేపద్యములో ప్రస్తుతము ఉన్న వంతెన కోన్నేళ్లుగా గుంతలు పడడముతో నేతలు అదికారులు పట్టించకున్న పాపా లేదు,. దీనితో అ రమదారి నరకానిక నకలుగామారింది,. గత పాలకుల నిర్లక్ష్యం వేసి రోడ్డు నాసిరకముగా ఉండడముతో మళ్లి మళ్లి గుంతలు పడడముతో ప్రజలు ఇబ్బందుల చెప్పనక్కర లేదు.తెలుగు దేశం ప్రభుత్వం అదికారములోకి రావడముతో ఇప్పుడు పనులుయ జరుగుతాయని జనము అశించారు. అయితే రెండు సంవత్సరాలు ప్రజలు అబివృద్ధి కోసం ఎదురు చూశారు దీనితో ఇటీవల మొంతా తుఫాన్ తాకిడి అదికము కావడముతో మంత్రి కుమారుడు యన్‌యంపడి పిరోజ్ కుందూ వంతెన ను పరిశీలించారు. దీనితో దానిని యుద్ధప్రాతిపదికను మరమ్మత్తు పనులు చేపట్టారు. ఈసందర్బము అయన మాట్లాడుతూ అబివృద్ధి పనులకు చిరునామా తెలుగు దేశం ప్రభుత్వం అర్థిక పరిస్థితుల బాగాలేక పొయిన ఎన్నికల్లో ఇచ్చిన వాటిని అన్నింటిని ఒక్కోక్కటి నేరవేరుస్తామని చెప్పారు.

## 25 అక్రమ మద్యం క్వాటర్ సీసాలు స్వాధీనం

**– ఎస్ఐ మహమ్మద్ రఫీ**

**రుద్రవరం, నవంబరు 2, ప్రభాతవార్తః**



మండల కేంద్రంలోని మద్యం దుకాణం నుంచి 25 అక్రమ క్వాటర్ సీసాలను ప్రభుత్వ అను మతులు లేకుండా తీసుకెళ్తున్న కానాల తిమ్మయ్య అనే వ్యక్తిని ఆదివారం పటు ట కోవడం జరిగిం దని ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపారు. ఆయన మాట్లాడుతూ కానాల తిమ్మయ్య అను వ్యక్తి ప్రభుత్వ అనుమతిలేకుండా 25 క్వాటర్ సీసాలను అమ్ముకోవడానికి తీసుకెళ్తుండగా అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేయడం జరిగిందని ఆయన అన్నారు. అలాగే మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమమద ్యం విక్రయించినట్లయితే అటువంటి వారిపై కేసులు నమోదుచేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈయన వెంట పోలీసులు మద్దిలేటిరెడ్డి, వీరాంజనేయులున్నారు.

## డిగ్రీ కళాశాలలో ముగిసిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం

**నందికొట్కూరు, నవంబరు 02,ప్రభాతవార్త:**



స్తానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత నెల 27న ఐక్యుఏసి కో.ఆర్డీనేటర్ డాక్టర్, బి.రిమళాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం నేటితో ముగిసాయి. ఈ సంధర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.రంగముని మాట్లాడుతు విద్యార్థులు తమ చదువులను శ్రద్దగా చదువుకొని వివిధ సబ్జెక్టులను అవగాహాన చేసుకొని మూడు సంవత్సరాల డిగ్రీని బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులై మంచి ఉద్యోగాలు పొంది ఉన్నత స్థాయిలో ఉండాలన్నారు. అధ్యాపకులు వారి వారి సబ్జెకులకు సంభందించి వాటి ప్రాముఖ్యత, సబ్జెక్టు స్వభావం, పాఠ్యాంశాలు మరియు నమూనా ప్రశ్న పత్రముల గురించి క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్తగా ప్రవేశం పొందిన ప్రథమ సంవత్సరం డిగ్రీ విద్యార్థినీ విద్యార్థులకు ప్రతి డిపార్ట్‌మెంట్, ప్రయోగశాలలు, గ్రంధాలయము, కంప్యూటర్ ల్యాబు.ఎన్ఎస్ఎస్ విభాగము. జిమ్నాజియం, పిజికల్ ఎడ్యుకేషన్ క్రీడామైదానం, డిజిటల్ తరగతి గదులను విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి అవగాహాన కల్పించారు,

## అంగన్వాడీ వర్కర్స్ కు వేతనాలు పెంచాలి

**నందికొట్కూరు, నవంబరు 2, ప్రభాతవార్త :**




కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ వర్కర్స్ కు వెంటనే వేతనాలు పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు మదార్‌బీ అధ్యక్షతన నందికొట్కూరు ప్రాజెక్టు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం, పట్టణ కార్యదర్శి గోపాలకృష్ణ మాట్లాడుతు ఐసిడిఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తి అయిన నేటికి అంగన్వాడీ వర్కర్స్‌కు కనీస వేతనం మలు కావడంలేదని,అతి తక్కువ వేతనాలతో ప్రభుత్వాలు పనులు చేయించుకుంటున్నాయని,కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు అయిన ఇంత వరకు హామీలు అమలు చేయలేదని, అంగన్వాడీ కేంద్రాలకు విధ్యుత్ బిల్లులు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉన్నాయయని, అలాగే టిఏ బిల్లులు ఇవ్వడంలేదని, పెషణట్రాక్‌లెఓ అన్‌లైన్ సమస్యలు ఉన్నాయి. కొత్త సెల్‌ఫోన్లు ఇస్తామని ఇవ్వలేదన్నారు. అంగన్వాడీ సెంటర్లకు నెలలు తరబడి కూరగాయల బిల్లులు చెల్లించలేదని, అంగన్వాడీ కేంద్రాలకు ప్రభుత్వమే వంట గ్యాస్ సరఫరా చేయాలని వారు కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్ కు బడ్జెట్‌లో నిధులు పెంచాలని, అంగన్వాడీలకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలన్నారు, ఈ సమావేశంలో కుర్షిత్‌బీ, సాజిదాప్రసన్న, పద్మావతమ్మ, రమణబాయి, శైలజ, లింగమ్మ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## డైవర్షన్ పాలిటిక్స్‌కు కేరాఫ్ చంద్రబాబు !

**: మాజీ మంత్రి జోగి రమేష్ అక్రమ అరెస్ట్ సిగ్గుచేటు ..!**

**: విద్యార్థి విభాగం తాలుకా అధ్యక్షులు దయ్యాల మహబూబ్**

**పెద్దకడబూరు, నవంబర్ 2, ప్రభాతవార్త :**



ప్రభుత్వం తప్పిదంతో శ్రీ కాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయం లో జరిగిన తొక్కిసలాటలో 10 మంది భక్తులు చనిపోతే కాశీబుగ్గలో జరిగిన ఘటనపై ప్రజల దృష్టి మళ్లించేందుకు, ఈరోజు పోలీసులు అక్రమ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ ను అక్రమంగా అరెస్ట్ చేయడం సిగ్గుచేటని డైవర్షన్ పాలిటిక్స్ కు కేరాఫ్ చంద్రబాబు మారారని మంత్రాలయం నియోజకవర్గం తాలూకా అధ్యక్షులు దెయ్యాల మహబూబ్ అన్నారు ఆదివారం ఆయన పెద్దకడబూరులో విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలలో కాలంలో ఆలయాల తొక్కిస లాటలో దాదాపుగా 23 మందికి పైగా మృతి చెందితే ఆలయాల్లో ఇటు వంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా సరైన సదుపాయాల పైనా దృష్టి పెట్టకుండా కూటమి నాయకులు యదేచ్ఛగా అక్రమంగా మద్యం తయారుచేసి రాష్ట్ర నలుమూలల విచ్చలవిడిగా అమ్మేస్తా ఉంటే దాని గురించి ప్రశ్నించినటువంటి మాజీ మంత్రి జోగి రమేష్ ని అక్రమ మద్యం కేసులో అక్రమంగా అరెస్ట్ చేయడం దారుణం అన్నారు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ప్రతిదీ కూడా గమనిస్తా ఉన్నారు రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి సరైన గుణపాఠాన్ని చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

## బ్రహ్మంగారి మఠానికి పట్టువస్త్రాలు సమర్పణ

**మహానంది, నవంబరు 2, ప్రభాతవార్తః**



వీరబ్రహ్మేంద్రస్వామివార్ల జయంతిని పురస్కరించుకొని ఆదివారం మహానంది దేవస్థానం నుండి పట్టువస్త్రాలు సమర్పించారు. మహానంది దేవస్థానం ఈవో శ్రీనివాసరెడ్డి, వేదపండితులు హనుమంతు శర్మ, ప్రధాన అర్చకులు జనార్ధన్‌శర ్మ, కొమ్మిద్దీ శంకరయ్య, కొమ్మిద్దీ సుబ్బయ్యల బృందం స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువెళ్లడంతో మఠం ప్రతినిధి ఈశ్వరాచారి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు, పట్టువస్త్రాలు సమర్పించారు. వారి వెంట టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యలు ఉన్నారు.

## అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు ఎంతో పుణ్యం

**కోవెలకుంట్ల, నవంబరు 2,ప్రభాతవార్త :**



అయ్యప్న మాలాదరణ చేసిన స్వాములకు బిక్ష ఏర్పాటు చేయడము ఎంతో పుణ్యమని తెలుగు దేశం పార్టీ యువ నాయకుడ కరిమద్దెల నాగేంద్రబాబు, దుర్గలు అన్నారు. పట్టణంలో అయ్యప్ప మాలాదారణ చేసిన వారు దాదాపు 150మందిపై ఉన్నారు.వీరందరిక అనునిత్యము పట్టణంలో ఎవరో ఒకరు మద్యహ్నాము బిక్ష ఏర్పాటు చేస్తు అయ్యప్ప స్వామి కృపకు పాత్రులు అవుతున్నారు. అందులో బాగంగా పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన సీనయర్ తెలుగు దేశం నాయకుఉయకరిమద్దెల మురళీ, దుర్గ దంపతుల కుమారుడు కరిమద్దెల నాగేంద్రబాబు స్వాములకు అదివారము అయ్యప్ప దేవాలయం నందు బిఓ ఏర్పాటు చేశారు ఈ బిక్షకు పట్టణంలో ప్రముఖ తెలుగు దేశం నాయకులందరు పాల్గొని బిక్షను అరగించారు.

## బాలల సంరక్షణ కేంద్రాలకు లైసెన్స్‌లు జారీ

**నంద్యాల హాస్పటల్,నవంబరు 02,ప్రభాతవార్త:**



నంద్యాల జిల్లాలో బాలల సంరక్షణ కేంద్రాలు నిర్వహిస్తున్న స్వచ్ఛంధ సంస్థలకు జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశాల మేరకు రాష్ట్ర వీధి బాలల సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి లైసెన్స్‌లు మంజూరు చేశారు. లైసెన్స్‌లను జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ లీలావతి, బాలల సంరక్షణ అధికారి హుస్సేన్‌బాష, బాలల రక్షణాధికారి స్వప్నప్రియదర్శిని జిల్లాలోని నాలుగు స్వచ్ఛంధ సంస్థలైన స్టార్ సోసైటి నంద్యాల, సంఘమిత్ర నంద్యాల,ప్రభుత్వ శిశు గృహా బాల సదన్ ఆళ్ళగడ్డ నిర్వాహాకులకు లైసెన్స్ అందజేశారు. ఈ కేంద్రాలలో అనాధ పిల్లల, వీధి బాలలు, బాల కార్మీకులు, రక్షణ కోరే ఏపిల్లలైనా హాస్టల్‌లో ఉంచుకొనుటకు బాలల సంక్షేమ సమితి పిల్లలను చేర్పిస్తారని వారు తెలిపారు. లైసెన్స్‌లు లేకుండా హాస్టళ్ళు నడితే కఠిన చర్యలు తప్పవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## గోనెగండ్లలోని వీదులలో గుర్రాలు స్వైర విహారం

**– ఇబ్బందులో గ్రామస్థులు**

**గోనెగండ్ల, నవంబరు 2, ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోన గాజులదిన్నె,హెచ్ కైరవాడి,వేముగోడు,కులుమాల,అలువాల గ్రామాల్లో గత నెల రోజులుగా గుర్రాలు స్వైరవిహారం చేస్తున్నాయి.ఆయా గ్రామాల్లోని వీదుల్లో అతి వేగంగా పరిగెత్తడంతో అరుబైట ఉన్నవారికి తగలడంతో వారు గాయాల పాలవుతున్నారు.రంగన్న,వలి అనే వ్యక్తులకు ఇటీవల గుర్రాలు తగలడంతో గాయాలయ్యాయి.అలాగే ద్విచక్రవాహనాలపై వెలుతున్న వారిని గుర్రాలు పరిగెత్తుతూ తగిలి కింద పడి గాయాలపాలైనా వారు ఉన్నారు.రహదారులకు అడ్డంగా గుర్రాలు నిలిచి ఉండటం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మరిందని గ్రామస్థులు తెలుపుతున్నారు.అలాగే రాత్రిపూట గ్రామ శివార్లలో ఉన్న పొలాలపై దాడి ఉన్న అరకోర పంటను నాశనం చేస్తున్నట్లు రైతులు తెలుపుతున్నారు.కావున ఆయా గ్రామ పంచాయతీ సిబ్బంది గుర్రాలను పట్టుకొని వాటి యజమానులకు అప్పగించాలని ప్రజలు కోరుతున్నారు.

## వండర్ కబ్స్ స్కూల్‌లో బాలల లైబ్రరీ ప్రారంభం

**: ముఖ్య అతిథిగా ఎపి ఎస్పీ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్**

**కర్నూలు హాస్పిటల్, నవంబర్ 2, ప్రభాతవార్త :**

జోహారపురం రోడ్డులోని వండర్ కబ్స్ స్కూల్‌లో చిన్నారుల కోసం బాలల లైబ్రరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రెండవ బెటాలియన్ కమాండెంట్ దీపికా పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేందుకు లైబ్రరీ ఉపయుక్తమని అన్నారు. కరస్పాండెంట్ దివ్య తేజా రెడ్డి మాట్లాడుతూ స్కూల్‌ను చిన్నారుల అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దామని తెలిపారు. పిల్లల తల్లిదండ్రులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆళ్లగడ్డ ప్రజలకు అధికభారం పెడితే చూస్తు ఉరుకోం

**ఆళ్లగడ్డ, నవంబరు 2, ప్రభాతవార్తః**



ఆళ్లగడ్డలోనే ఇసుక డంపు ద్వారా రూ.7 వేలకు ఇసుక ట్రాక్టర్ ఇవ్వబడుతుందని, ఎక ్కడో జమ్ములమడుగు నుండి ఆళ్లగడ్డకు వచ్చి రూ.9 వేల నుండి రూ.10 వేలకు ఇసుక అమ్ముతూ ఆళ్లగడ్డ ప్రజలకు అధికభారం పెడితూ చుస్తు ఊరుకోమని టిడిపి ఆళ్లగడ్డ మండల కన్వీనర్ శీలం హరికుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జమ్ములమడుగు, ప్రొద్దుటూరు వాసులు మళ్లీ ఆళ్లగడ్డకు వచ్చి ఇసుక ఎక్కువ ధరలకు అమ్మితే పోలీసులకు తెలిపి చట్టపరమైన చర్యలు తీసుకునేలా చేస్తామన్నారు. ఆళ్లగడ్డలో ఎక్కువ ధరకు ఇసుక అమ్మేహక్కు వారికి ఏవరిచ్చారని ప్రశ్నించారు. జమ్ములమడుగు వాసులు కోవెలకుంట్ల ఇసుక తీసుకెళ్తె ట్రాక్టర్లను వెనక్కు పంపించారని ఆళ్లగడ్డకు ఏదో బతుకుదెరువుకోసం వచ్చారని మేం పోనిలే అనుకుంటే మాపై బురదజల్లే విడియోలు చేసి కూటమి ప్రభుత్వం కాపాడాలంటూ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. విడియోలు ఏవరు చేపించారో త్వరలో బయటపెట్టి వారిపై చర్యలు తీసుకునేలా చేస్తామని తెలిపారు. ఆళ్లగడ్డ తాలూకలో ట్రాక్టర్ ఇసుక జీఎస్టీ ట్రాన్స్‌పోర్టుతో కలిపి రూ.7 వేలకు దొరుకుతుందని అంతకంటే ఎక్కువ అమ్మితే ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ పెట్టిన టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేయాలని ఆయన తెలిపారు.

## 4న కుంకనూరు గ్రామ పంచాయతీ కూరగాయల మార్కెట్ వేలం పాట

**దేవనకొడ, నవంబరు 02, ప్రభాతవార్త ;**

ఈనెల 4వ తేదీన కుంకనూరు గ్రామ పంచాయతీ దినసరి కూరగాయల మార్కెట్ వేలం పాటను దేవనకొండ టర్నింగ్ దగ్గర ఉదయం 11 గంటలకు మరలా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ గోపాల్, సర్పంచ్ ఈరమ్మ, పంచాయతీ కార్యదర్శి శివశంకర్‌సింగ్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఆసక్తి గలవారు ధారావత్తు రూ.50 వేలు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంపాటను గెలుచుకున్న వారు వేలం ముగిసిన వెంటనే వేలంపాట మొత్తాన్ని ఒకేసారి అదే సమయంలో మొత్తం గ్రామ పంచాయతీకి చెల్లించాలన్నారు. వేలంలో మద్యం సేవించిన వారు, మతిస్థిమితం ఉన్న వారు పాల్గొనకూడదన్నారు. వేలంలో పాల్గొనే వారికి గ్రామ పంచాయతీకి ఎటువంటి పాత బకాయిలు ఉండరాదన్నారు. నిర్ణీతకాలంలో జరిగే కష్టనష్టాలకు గ్రామ పంచాయతీ ఎటువంటి బాధ్యత వహించదన్నారు. హెచ్చు పాట పాడి మార్కెట్‌ను దక్కించుకున్న పాటదారుడు రూ.100 స్టాంపు కాగితంపై నిబంధనలకు కట్టుబడి ఉంటానని గ్రామ పంచాయతీ కార్యదర్శి వారికి అగ్రిమెంట్ చేసి ఇవ్వాలన్నారు.

## కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలి

**– రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్యకు విన్నవించిన ఎండీహళ్లి సర్పంచ్ సుధాకర్**

**హొళగుంద, నవంబర్02, ప్రభాతవార్త;**



హొళగుంద మండలంలోని దేవరగట్టు, హొళగుంద, ఎం.డి.హళ్లి గ్రామాల్లో 4 కమ్యూనిటీహాల్స్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని ఎండీహళ్లి సర్పంచ్, క్లస్టర్–1 ఇన్‌చార్జి సుధాకర్ ఆదివారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కార్యాలయంలో రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎండీహళ్లి సర్పంచ్, క్లస్టర్–1 ఇన్‌చార్జి సుధాకర్ మాట్లాడుతూ త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తామని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

**వెలుగోడు, నవంబరు 2, ప్రభాతవార్త :**



స్తానిక ఆర్టీసి బస్టాండు సమీపంలో అనుమానాస్పద మృతదేహం ఉన్నట్లు ఆదివారం ఉదయం పోలీసులకు సమాచారం అందింది. ఎస్సై సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకొని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వెలుగోడు పట్టణానికి చెందినన బట్టు కిరణ్(38)గా కుటుంబ సభ్యులు గుర్తించారన్నారు. మృతుని భంధువులు బుట్టు కిరణ్ శనివారం రాత్రి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. మృతు అన్న చెన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నామన్నారు. ముఖంపై రక్త గాయాలతోమృతి చెందడంతో అనుమానాలకు తావిస్తుంది. కిరణ్ మృతి హాత్యనా, లేక ఆత్మహాత్యనా లేక ఏదైన ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అండర్-19 డార్స్‌గేమ్‌కు ఎంపికైన ఇంటర్ విద్యార్థులు

**ఆలూరు, నవంబరు 02, ప్రభాతవార్త :**



స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అండర్–19 డార్స్ గేమ్‌కు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఎంపైన మనోజ్‌కుమార్ ఇంటర్ ఫస్టియర్, భాషా ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్నారు. ఈ సంధర్భంగా ప్రిన్సిపాల్ వారిని అభినంధిస్తూ చదువుతో పాటు క్రీడారంగంలో బాగా రాణిచాలని, జిల్లా స్తాయి నుండి రాష్ట్రస్థాయికి, జాతీయ స్థాయికి ఎదిగి కళాశాలకు, ఊరికి మంచిపేరు తేవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శశికుమార్, ఫిజికల్ డైరెక్టర్ హాసన్‌బాష, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీగిరి క్షేత్రం నుండి శ్రీశైలంకు పాదయాత్ర

**ఆస్పరి, నవంబరు 2, ప్రభాతవార్త:**

కార్తీక మాసం పురస్కారించుకొని మండల పరిధిలోని బినిగేరి గ్రామ కొండల్లో వెలిసిన శ్రీగిరి క్షేత్రం నుండి శ్రీశైలం కు 800 మంది భక్తులు పాదయాత్రగా బయలుదేరారు. ఆదివారం ఉదయం స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ నిర్వాహకులు శ్రీనివాసనాయన ఆధ్వర్యంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సంధర్భంగా ఆశ్రమ గురువు శ్రీనివాసనాయన మాట్లాడుతు కార్తీక మాసంలో పాదయాత్ర చేసి శివుని దర్శించుకుంటే ఎంతో మేలు కలుగుతుందన్నారు. రెండు రోజుల పాటు అడవి మార్గంలో పాదయాత్ర జరగుతుందన్నారు. సోమవారం శ్రీశైలం చేరుకొని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకొని పూజలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, కృష్ణారెడ్డి, రవిచంద్ర, వీరేష్, సుధా, నాగరాజు, దత్తాత్రేయరెడ్డి, వెంకటరాముడు, అనిల్‌స్వామి, గురూజి, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సకల ఆత్మల సంస్మరణ మహోత్సవం

**ఆదోనిలీగల్, నవంబర్02, ప్రభాతవార్త;**



సకల ఆత్మల సంస్మరణ మహోత్సవ కార్యక్రమం ఆదివారం కతోలిక విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ డీన్ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారపేటలో సాయంత్రం సమాధుల తోట ప్రాంగణంలో భారీ దివ్యబలి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ లోకం వదిలి పరలోకానికి చేరినటువంటి సకల ఆత్మల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం అదృష్టమన్నారు. మానవ జీవితం అశాశ్వతమని, శాశ్వతమైన మార్గమే పరలోక రాజ్యమన్నారు. మట్టి నుంచి వచ్చిన ఈ శరీరం మట్టిలోనే కలవాల్సిన అవసరం ఉందన్నారు. మంచి, చెడులు మాత్రమే ప్రతిఒక్కరి వెంట వస్తాయన్న విషయాన్ని గుర్తు చేశారు. సమాధుల తోటలో క్రైస్తవులు వందలాది మంది వచ్చి వారి వారి బంధువుల సమాధుల దగ్గర పూలాంకరణలు చేశారు. మనిషి జీవితం శాశ్వతంకాదని, ఆరాటం పోరాటాలతో కాలయాపన చేయవద్దన్నారు. దైవమార్గంలో ప్రతిఒక్కరూ నడుచుకుని ఆధ్యాత్మిక శక్తిని హృదయంలో పదిల పరుచుకున్నప్పుడే మోక్షమార్గం సాధ్య పడుతుందన్నారు. పూజా అనంతరం గురువులు సమాధుల వద్దకు వచ్చి ఆశీర్వాదాలు అందజేశారు. ఆదోని సెయింట్ అంతోని పాఠశాల సహాయక గురువు విన్సెంట్, కన్య స్త్రీలు పాల్గొన్నారు.

# అప్పులు కట్టేది మేమే.. అందలం ఎక్కించేది మేమే..!






**: బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య**

**కర్నూలు నవంబర్ 02 ప్రభాతవార్త ప్రతినిధి ;** అప్పులు చెల్లించేధీ మేమే అందలం ఎక్కించేది మేమేనని రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. ఆదివారం స్థానిక పెద్దపాడు రోడ్డు లోని బీరప్ప దేవాలయంనదు నిర్వహించిన కురువల 23 వ కార్తీక వనభోజనం కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. కురువ కులస్థులు వెనుకబడిన వర్గాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తూ దేశ ఆర్థికవ్యవస్థను బలోపేతం చేస్తుంటే కార్పొరేట్ బడాబాబులు వందల,వేల కోట్లు బ్యాంకుల్లో ఉండే ప్రజల సొమ్మును ఖాజేషి పారిపోతున్నారు. కురువ కులస్థులు ఐఖ్యతతో ఉన్నపుడే అన్ని రాజకీయపార్టీలు చేరదీసి చట్ట సభలకు పంపుతాయన్నారు. బీరప్ప స్వామి గుడి ఆవరణంలో కల్యాణ మండపం నిర్మించడానికి రూ . 90 లక్షలు ఎంపీ నిధుల నుండి కేటాయించినట్లు తెలిపారు. అదేవిధంగా వెనుకబడిన వర్గాలు అన్ని రంగాలలో ముందుకు రావాలంటే విద్య తప్ప మరొకటి లేదనన్నారు. ప్రతి ఒక్కరు పిల్లలకు చదువులు చెప్పించినపుడే అభివృద్ధి సాధ్యమవు తుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ పార్థసారథి కర్నూలు ఎంపీ నాగరాజు ఎంపీ నిధుల నుండి కల్యాణమండపం నిర్మాణానికి తలా రూ . 25 లక్షలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కురువలకు ఎలాంటి సమస్య తలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ విద్యార్థి సంఘం డా అరుణ్ కుమార్, కురువ సంఘం వర్కింగ్ ప్రసిడెంట్ శివన్న, అధ్యక్షులు శ్రీనివాసులు, కురువ సంఘం నాయకులు గడ్డం రామకృష్ణ, డిప్యూటీ కలెక్టర్ మల్లికార్జున, అమీలియో హాస్పిటల్ అధినేత లక్ష్మి ప్రసాద్ , అరుణ కుమారి, యం ఆర్ ఓ ఆంజినేయులు, పాల సుంకన్న, సత్యనారాయణమ్మ, కిష్టన్న, కార్యదర్శి రంగస్వామి, కత్తి శంకర్, ధనుంజయ, ఉరుకుంద, వెంకటేశ్వర్లు, నాగన్న, కొత్తపల్లి దేవేంద్ర, లక్షమన్న, శివరాం, తౌడు శ్రీనివాసులు, తిరుపాలు, మద్దిలేటి గొర్రెల శ్రీనివాసులు మహిళా సంఘం నాయకురాలు లీలమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు చల్లగా ఉండాలని తిరుమల వెంకటేశ్వర స్వామికి పూజలు

**: తిరుమల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్‌తో బెటీ**
**: టిడిపి ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి**



**చిప్పగిరి, నవంబర్, 02, ప్రభాతవార్త :** ఆలూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజలు పసిడి పంటలు పిల్లాపాపలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామిని ఆలూరు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ వైకుంఠం జ్యోతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి సన్నిధిలో కలియుగ దైవాన్ని వైకుంఠం దంపతులు జ్యోతి శివప్రసాదులు దర్శించుకుని పీఠాధిపతుల చేత ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతిలో తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పార్టీ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తో ఆలూరు టిడిపి ఇంచార్జ్ జ్యోతి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాదులు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరువురు పలు విషయాలను చర్చించుకుని పార్టీ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన విషయాల గురించి చర్చించినట్లు ఆలూరు ఇంచార్జ్ జ్యోతి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఆలూరు నియోజకవర్గం లో 2029లో తెలుగుదేశం జెండా ఎగరవేస్తామని, త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ప్రతి గ్రామంలో తెదేపా అభ్యర్థులు గెలిపించుకుంటామని ఆమె జోస్యం చెప్పారు. వెంకటేశ్వర స్వామి దైవ ఆశీర్వాదముతో ఆలూరు అభివృద్ధి బాటలో నడిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రహమాన్ పాల్గొన్నారు.



## నూతన ఎస్సైగా.. వేణుగోపాల్ రాజు బాధ్యతలు



**సి.బెళగల్ నవంబర్ 02 ప్రభాతవార్త :** సి.బెళగల్ మండలం లో పనిచేస్తున్న పరమేష్ నాయకు నోవిఆర్ కు బదిలీ చేయగా.. ఆయన స్థానంలో వేణుగోపాల్ రాజును నియమించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు ఈ సందర్భంగా నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలోని ఎన్ని గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ కారణాలు జరగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఆయన కోరారు అవాంఛనీయ కారణాలకు పాల్పడిన వారిని ఎంతటి వారినైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ప్రజలకు సూచించారు

## రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

**- దేవనకొండ సీఐ వంశీనాథ్ - రౌడీషీటర్లకు కౌన్సెలింగ్**



**దేవనకొండ, నవంబర్02, ప్రభాతవార్త;** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని దేవనకొండ సీఐ వంశీనాథ్ ఆదేశించారు. ఆదివారం సా ్థనిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లు చెడు నడవడికను వదిలేసి మంచి మార్గంలో నడవాలన్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు రౌడీషీటర్ల కదలికలను పరిశీలిస్తూ ఉంటామని సీఐ చెప్పారు.

## ఎమ్మెల్యే సమక్షంలో టిడిపి లో చేరిన వైసిపి నాయకులు



**నందికొట్కూరు,నవంబరు 2,ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలోని పగిడ్యాల మండలం ఎన్.ఘణపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చంద్రేష్ ఆధ్వర్యంలో నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య సమక్షంలో పలువురు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాండ్ర రఫీ, మన్సూరు, ఉస్మాన్, నాగూరు, దర్గయ్య, ఉస్మాన్ వలి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు.

## పటానికి పూల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

**: గోనెగండ్లలో ఘనంగా బీవీ జయంతి వేడుకలు**

**గోనెగండ్ల,నవంబరు,2,ప్రభాతవార్త** మండల కేంద్రమైన గోనెగండ్లలో దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి 76వ జయంతి వేడుకలు ఆదివారం మండల టీడీపీ నాయకులు ఘనంగా జరుపుతుకున్నారు,ఆయన చిత్రపటానికి పూల వేసి నివాళ్లు అర్పించారు.టీడీపీ మండల కాన్వీనర్ తిరుపతయ్యనాయుడు,నజీర్‌సాహెబ్,బేతాల బడేసాబ్,సింగిల్ విండో అధ్యక్షుడు రామాంజినేయులు, మురళినాయుడు, నూరఅహ్మద్,భారతం రహంతుల్లా కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీవీ మోహన్‌రెడ్డి ఎమ్మిగనూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం పాటు పడ్డాడని అన్నారు.ఎమ్మిగనూరు అభివృద్ధికి ఎంజీ సోమప్ప తరువాత అంత పాటు పడిన వ్యక్తి ఒక్క మోహన్‌రెడ్డి మాత్రమే నని అన్నారు.ఈ కార్యక్రమంలో మహల్ రహంతుల్లా,కున్నూరురమణచౌదరి,ఫక్రుద్దీన్,అడ్వకేట్ చం ద్రశేఖర్, వెంకటేశ్వర్లు,మదీనా,గిర్ని కౌలుట్లయ్య,శ్రీను,మాజీ సర్పంచ్ రంగముని,రంపూరం రఫిక్,సందిప్‌నాయుడు,చంద్ర పాల్గొన్నారు.



# నీళ్ళపెట్రోల్‌తో.. వాహనదారులకు పచ్చిమోసం..!

**: పెట్రోల్ బంకులో ఇష్టారాజ్యంగా వాహనదారుల నుంచి దోపిడి**
**: ఆదివారం 50 వాహనాలకు నీళ్ళపెట్రోలు ఇచ్చారంటూ ఆందోళన**
**: పోలీసు స్టేషన్‌కు చేరిన నీళ్ళ పెట్రోల్ విక్రయాల మోసాలు**
**: నీళ్ళ పెట్రోలుతో నష్టపోయిన ద్విచక్ర వాహనాలను రిపేరి చేయిస్తాం**
**: అర్బన్ సిఐ రాము జోక్యంతో సర్దుమనిగిన సమస్య**



**ఆత్మకూరు, నవంబర్02, ప్రభాతవార్త:** వ్యాపారుల పేరుతో ద్విచక్ర వాహనదారులను అడుగడుగున మోసాలకు పాల్పడుతునే ఉన్నారు. లీటరు పెట్రోలు కొనుగోలు చేయాలంటే రూ.112లు మూల్యం చెల్లించుకోక తప్పదు ప్రభుత్వాలు మారుతున్న ప్రతి సంవత్సరం వాహనదారులపైన జిఎస్‌టి పేరుతో పన్నులు కట్టాలంటూ వాహనదారులతో సంవత్సరానికి ఒక్కసారి పెట్రోలు చార్జీలు పెంచుతూ తగ్గిస్తూ చేస్తున్న పెట్రోలు బంకుల యాజమాన్యల మోసాలకు అధికారులు కనుచూపు మేరా తనీఖీలు మరిచారని చెప్పవచ్చు. ఒకవైపు మాముల మత్తులో మునిగి తెలుతున్న అధికారమా లేక నీళ్ళ పెట్రోలతో దోపిడి చేస్తున్న యాజమాన్యలకు సపోర్టు చేస్తూ మాములకు అలవాటు పడ్డారా అనే విషయం నేటికి అర్థం కాలేదు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని భారత్ పె ట్రోలు బంకులో దాదాపు 50మంది వాహనదారులకు నీళ్ళ పెట్రోలు అమ్మకాలు కొనసాగిస్తూ వాహనదారులను పచ్చిమోసం చేస్తున్నారంటూ ద్విచక్ర వాహనదారులు ఆందోళనలకు పెద్దఎత్తున్న దిగారు. ఈ విషయం ద్విచక్ర వాహనదారులు పోలీసు స్టేషన్‌లకు తీసుకెళ్లి నీళ్ళ పెట్రోలు అమ్ముతున్న యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు విన్నవించారు. నీళ్ళ పెట్రోలు విక్రయాలు జరుపుతున్న యాజమాన్యం పోలీసులు వెంటనే స్టేషన్‌కు పిలిపించి పెట్రోలు పోసిన ప్రతి ద్విచక్ర వాహనాని మైనర్ రిపేరులు చేయించే విదంగా చౌరవ తీసుకుంటామని వాహనదారులకు హామీ ఇచ్చిన్నట్లు తెలసింది. వివాదస్పదంగా నీళ్ళ పెట్రోలు అమ్మకాలు కొనసాగిస్తున్న సమస్యను ఆత్మకూరు అర్బన్ సిఐ రాము జోక్యంతో ఈ విషయం అక్కడిక్కడే సర్దు మనిగిందని చెప్పవచ్చు. ఆత్మకూరు ప్రాంతంలో పెట్రోలు బంకులలో ద్విచక్ర వాహనదారులను మోసం చేస్తున్న ప్రతి పెట్రోలు బంకులను తనీఖీలు చేయాల్సిన అధికార యంత్రాంగం కనుచూపు మేర కనిపించలేక పోవడంతోనే నీళ్ళ పెట్రోలు అమ్మకాలు ఆత్మకూరు ప్రాంతంలో ఊపందుకున్నాయని చెప్పవచ్చు. ఇతర రాష్ట్రాలలో పెట్రోలు ధరలు తక్కువగా ఉన్నప్పటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పెట్రోల్ ధరలు కేంద్రం నిర్దేశించిన నిబందనల మేరకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. ప్రతి వ్యాపారంలో కల్తీ కొనసాగిస్తున్న విషయం అందరికి



తెలిసిందే. కల్తీ వ్యాపారం నివారించాల్సిన అధికారులు నామకవాస్తిగా దాడులు చేస్తారే తప్పా మళ్లీ అటువైపు కన్నెత్తిచేసే ప్రసక్తే ఉండదు. నీళ్ళ పెట్రోలు అమ్మకాలు ఆత్మకూరులో ఎన్ని రోజుల నుంచి కొనసాగుతుంది ఈ వ్యాపారానికి చీకటి సామ్రాజ్య ఆదిపతి ఎవరు అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు లీటరు పెట్రోలు రూ.112 ఉన్నప్పటికి ద్విచక్ర వాహనదారులు రూ.100 పెట్రోలు కావాలని అడుగగా రూ.99 పెట్రోలు మా త్రమే మీటరు చూపించడం మరో విశేషం. ఒక ద్విచక్ర వాహనదారులపై రూపాయి చొప్పున వందల ద్విచక్ర వాహనదారులు ఎన్ని రూపాయాలు వదులు కోవాలనో అధికారులే ఆలోచన చేయాల్సి ఉంది. నీళ్ళ పెట్రోలు విక్రయాలు కొనసాగిస్తే చర్యలు తీసుకోక తప్పదని ఒకవైపు అధికారులు చెబుతున్నప్పటికి పెట్రోలు బంకుల పేరుతో అక్రమ వ్యాపారులకు పాల్పడుత్ను పెట్రోల్ యాజమన్యాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ఏదిఏమైన్నప్పటికి ఆత్మకూరు పట్టణంలో నీళ్ళ పెట్రోలు విక్రయాలు జరిపిన ఈ బంకును తాత్కాలికంగా నిలిపివేసిన్నట్లు విశ్వసనీయమైన సమాచారం.

# డైవర్సన్ పాలిటిక్స్ లో భాగంగానే జోగి రమేష్ అరెస్టు : ఎమ్మెల్యే

**ఆలూరు,నవంబరు 2, ప్రభాతవార్త:** మొంథా తుఫాన్, కాశీబుగ్గ ఘటనలలో ప్రభుత్వ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మళ్లించడానికి కూటమి ప్రభుత్వం డైవర్సన్ పాలిటిక్స్‌లలో భాగంగానే బీసి నేత మాజీ మంత్రి జోగి రమేష్ ను అరెస్టు చేశారని ఆలూరు ఎమ్మెల్యే బూసినే విరుపాక్షి అన్నారు. ఆదివారం ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడతు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చకుండా లోకేష్ రెడ్‌బుక్ భాగంగానే వైసిపి నాయకులపై కక్ష సాధింపు



దోరణితోనే అక్రమ కేసులు బనాయిస్తూ అరెస్టులకు పాల్పడుతున్నారని, కల్తీ మద్యం తాగి చనిపోయిన కుటుంబాలను కూడ ఈ కూటిమి ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు. డిప్యూటి సిఎం పవవన్ కళ్యాణ్ కల్తీ మద్యంపై ఇంత వరకు మాట్లాడకుండా మౌనం పాటిస్తున్నారని ఆయన విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమ అరెస్టులకు భయపడి వైసిపి నాయకులు ఎవరు వెనక్కి తగ్గేదిలేదని,నిరంతరంప్రజల కొరకు పోరాడుతామ న్నారు. అక్రమ అరెస్టులకు ప్రతిచర్య తొందరలోనే ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ సమావేశంలో వైసిపి మండల కన్వీనర్ మల్లికార్జున, కో-కన్వీనర్ వీరేష్, జిల్లా నాయకులు ఎస్కేగిరి, భాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థకు చేరిన.. కోడుమూరు గ్రంథాలయ కార్యాలయం

**- ఆదరణ ల్లేక .. బోసి పోయిన విజ్ఞాన కేంద్రం**
**- పూర్వవైభవంను తీసుకురావాలని పాఠకుల వినతి**



**కోడుమూరు,నవంబర్ 2, ప్రభాతవార్త :** నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరులో గ్రంథాలయ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం ఈ కార్యాలయం ఇప్పుడా .. అప్పుడా అన్నట్టుగా... కూలిపోయే స్థితిలో నెలకొనింది. దీంతో గ్రంథాలయం నిర్వహణా అంతా పూర్తిగా నిల్చిపోయే దశకు చేరుకోవడంతో కార్యాలయంకు వచ్చే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందనే చెప్పాలి. అంతే గాక ఇక్కడ పనిచేసే గ్రంథాలయ అధికారి కూడా లేక పోవడం గమనార్హం. ప్రస్తుతం అంతంత మాత్రంగా ఈడ్చుకొస్తున్న కార్యాలయంలో ప్రతి రోజు ఉదయం ఇక్కడకు కేవలం రెండు దిన పత్రికలు మాత్రమే పాఠకులకు అందుబాటులో ఉంటున్నాయి. వీటితోనే ఇక్కడకు విజ్ఞానం కోసం వచ్చే వారు ఆ రెండు దినపత్రికలనే చదువుకునే వెసలు బాటు ఉండటం శోచనీయం. గ్రంథాలయ సంస్థలపై ఆదరణలు కొరవడడంతోనే నేడు ఆ సంస్థలు మూసివేసుకునే స్థితికి చేరుకున్నాయని చెప్పకతప్పదు. గతంలో ఇక్కడి గ్రంథాలయ కార్యాలయంకు రిటైర్డు అయిన ప్రభుత్వ ఉదో ్యగులు,ప్రశాంతంగా గంట పాటు ఇక్కడకు వచ్చే వారి మనుస్సుకు నచ్చే పుస్తకాలను చదివి వాటితో ప్రశాంతతనే పొందాలనుకునే వారు వచ్చే వారు. ఆ రోజున ఇక్కడ పాఠకులకు అందించే విజ్ఞానం పుస్తకాలను చదివేందుకు పాఠకులు పోటీపడే వారు. అంతే గాక చిన్నారులకు ఉపయోగపడే చందమామ,బాలమిత్ర కథల్లాంటి పుస్తకాల వసతి కూడా ఉండేవి. అలాంటి సౌకర్యాలు ప్రస్తుతం ఇక్కడ లభించడం లేదు. విజ్ఞానం పెంచే ఎలాంటి పుస్తకాలు కానీ, నిరుద్యోగ యువకులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాల జాడే లేక పోవడం శోచనీయం. గ్రంథాలయ సంస్థల అభివృద్ధికై జిల్లా స్థాయిలో ఉండే అధికారులు సైతం ఇక్కడి కార్యాలయ నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విషయం సర్వత్రావ్యక్తం అవుతోంది. ప్రతి మండల కేంద్రాలల్లో విజ్ఞానంను పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రంథాలయం సంస్థలను ఏర్పాటు చేశారు .. కానీ వాటిని ఆచరణలో పాఠకులకు ఉపయోగపడే విధంగా సౌకర్యాలు కల్పించలేక పోయారన్న విమర్శలు కూడా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు,నిరుద్యోగ యువకులకు,విశ్రాంతి ఉదో ్యగులకు అందించే విజ్ఞాన కేంద్రాలకు నోచుకోలేని స్థితి చేరుకోవడం విచారకరం. ప్రతి రోజు గ్రంథాలయ సంస్థలల్లో లభించే పుస్తకాలతో వాటి వల్ల వచ్చే విజ్ఞానంతో పాఠకుల దైనందిన జీవితాలకు ఎంతో దోహదపడే అవకాశాలు ఉన్నాయి. అనాటి వైభవం నేడు మచ్చుకైనా .. కానరావడం లేదు. దీంతో ఇక్కడున్న గ్రంథాలయ సంస్థ రోజు రోజుకి మరుగునపడే పరిస్థితులు కనిపిస్తున్నా .. ఈ సంస్థకు తిరిగి పూర్వం వైభవం వైపు తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





## చిప్పగిరి హౌసింగ్ ఏఈ అడ్రస్ ఎక్కడ...?

**: మండలం వైపు తిరిగి చూడని ఏఈ చిప్పగిరి ఏఈనే పత్తికొండ ఇన్చార్జి డిఈ**

**చిప్పగిరి, నవంబర్, 02, ప్రభాతవార్త :** చిప్పగిరి మండలం హౌసింగ్ ఏఈ అడ్రస్ ఎక్కడ అని చిప్పగిరి మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చిప్పగిరి హౌసింగ్ ఏఈ గా విజయ్ కుమార్ ను నియమించారు. చిప్పగిరి ఏఈనే పత్తికొండ ఇన్చార్జి డిఈ గా నియమించడంతో, చిప్పగిరి వైపు హౌసింగ్ ఏఈ కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మంజూరు చేసే గృహాలు, తదితర వాటిని పరిశీలించాల్సిన అధికారి ఇన్చార్జి కుర్చీకే పరిమితమై సొంత కూర్చుని మరిచాడని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పై అధికారులు పత్తికొండ హౌసింగ్ డీఈ గా రెగ్యులర్ వారిని కేటాయించి, చిప్పగిరి హౌసింగ్ ఏఈ చిప్పగిరిలో విధులు నిర్వహించే విధంగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. హౌసింగ్ ఎఇ చిప్పగిరిలో విధులు నిర్వహించకపోవడంతో, కిందిస్థాయి హౌసింగ్ సిబ్బంది నూతన గృహ నిర్మాణాలపై ఉలకా పలకలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. కర్నూలు జిల్లాకు 5 వేల పైచిలక నూతన గృహాలు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ సిరి పత్రిక ప్రకటన ద్వారా తెలియజేయగా, గ్రామాలలో సచివాలయ సిబ్బంది నూతన గృహాలను పరిశీలించి ఇల్లు లేని వారికి ఎంపిక చేసే ప్రక్రియ కొనసాగించాల్సి ఉండగా చివరి తేదీ నవంబర్ 5 ఉండగా, గ్రామాలలో హౌసింగ్ అధికారులు తిరిగి చూడకుండా, ప్రభుత్వ ఆదేశాలను నీరుగారుస్తున్నట్లు చిప్పగిరి మండలంలో నీ గ్రామాల ప్రజలు ఆదివారం ప్రభాతవార్తతో వాపోయారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకొని చిప్పగిరి హౌసింగ్ ఏఈ చిప్పగిరిలో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామల ప్రజలు జిల్లా కలెక్టర్ ను కోరుతున్నారు.

## ఆలూరు ఎస్సైగా మన్మద విజయ్



**ఆలూరు, నవంబరు 02, ప్రభాతవార్త:** ఆలూరు పోలీసు స్టేషన్ ఎస్సైగా మన్మద విజయ్ పదవి భాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలిలో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై మహబూబ్‌బాషా కడప జిల్లాకు బదిలి కావడంతో ఆయన స్థానంలో కర్నూలులో పని చేస్తున్న మన్మద విజయ్ బదిలిపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు సహాకరించాలని, ఎంతటి వారైన జూదం, బెట్టింగ్, గ్రామాలలో అసాంఘిక కార్యా కలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. యువత కూడా చెడు వ్యసనాలకు, డ్రగ్స్, మద్యం వంటి వాటికి దూరంగా ఉండాలని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, తలిదండ్రులు మైనరైన తమ పిల్లలకు వాహానాలు ఇవ్వరాదని ఎస్సై తెలిపారు.

## అసాంఘీక చర్యలకు పాల్పడితే శిక్షలు తప్పవు..

**- రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన ఎస్ఐ రమేష్‌రెడ్డి..**

**కోసిగి, నవంబరు 2, ప్రభాతవార్త** కోసిగితో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఎవరైన అసాంఘీక చర్యలకు పాల్పడితే సహించేది లేదని వారికి శిక్షలు తప్పవనికోసిగి స్టేషన్‌లో నూతనంగా ఎస్ఐగా పదవీ బాధ్యతలను సీకరించిన రమేష్‌రెడ్డి హెచ్చరించారు.. ఆదివారం కోసిగి మండల పరిదిలోఉన్న రౌడీ షీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు..శాంతి, భద్రతలకు విఘాతం కలిగించినా, ఎలాంటి అసాంఘీక చర్యలకు పాల్పడినాతీసుకుంటున్నట్లు తెలిపారు..రౌడీ షీటర్లగా ఉంటున్న వారందరూ సత్‌ప్రవర్థన కలిగి గొడవలకు, ఘర్షణలకు దూరంగా ఉంటూ తమపైమోపబడిన రౌడీ షీటర్‌ను తొలగించుకోవాలని సూచించారు..తమ కళ్లేదుటే ఏదైన విఘాతం కలుగుతున్నట్లు తెలిస్తే వెంటనే స్టేషన్‌కుసమాచారం అందించాలన్నారు..నేరం జరిగినప్పుడు కేసులు నమోదు చేయడం ముఖ్యం కాదని, ఈ నేరం జరుగకుండా చూసుకోవడంముఖ్యమని, ఇందుకు ప్రతి ఒక్కరు సహకరించా లన్నారు.. శాంతియుతంగా జీవిస్తూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని లేనిచో శిక్షలు ఉంటాయని హెచ్చరించారు..

